బిసి కవితా సంకలనం



తెలుగు భాషా చైతన్య సమితి

లక్ష్య సాధన ఫౌండేషన్

తెలుగు భాషా చైతన్య సమితి

7వ వార్షికోత్సవం సందర్భంగా...

బి.సి. కవిత

(కవితా సంకలనం)

ప్రధాన సంపాదకులు

డాక్టర్ వి.జయప్రకాష్

సంపాదకులు

పి.బడేసాబ్

రాజగోపాల్ నాయుడు

పెబ్బేటి మల్లికార్జున్

ఎడ్ల కల్లేష్

కె. సత్యనారాయణ

తెలుగు భాషా చైతన్య సమితి

2-3-647/ఏ/74, ప్రేమ్‌నగర్ కాలనీ

అంబర్‌పేట, హైదరాబాద్ - 13.

B.C. Kavitha - Collection of poems;
Chief Editor: Dr. V. Jaya Prakash; **Editors:** P. Badesab, Rajagopal Naidu, Pebbeti Mallikarjun, Yedla Kallesh, K Sathyanarayana.

ముద్రణ: డిసెంబర్, 2019

ప్రచురణ సంఖ్య: 9

ప్రతులు: 500

వెల: రూ. 150/–

ISBN
978-93-5382-748-9

ప్రతులకు:

తెలుగు భాషా చైతన్య సమితి
2–3–647/ఏ/74, ప్రేమ్‌నగర్ కాలనీ
అంబర్‌పేట, హైదరాబాద్ – 13.
సెల్ నెం. 9160607662, 8247862414

మరియు

ప్రముఖ పుస్తక విక్రేతలు

ప్రచురణ:

తెలుగు భాషా చైతన్య సమితి, హైదరాబాద్.

ముద్రణ:

లేపాక్షి ప్రింటర్స్, హైదరాబాద్ – 9246537133

అంకితం

తమ జ్ఞానాన్ని,
సమయాన్ని,
ధనాన్ని వెచ్చించి
బి.సి.ల అభ్యున్నతికి
అహర్నిశలు
కృషిచేసిన, చేస్తోన్న
ప్రతి ఒక్కరికి...

బిసి కవిత

బి.సి. గొంతుక

సమాజ పరిణామక్రమంలో అనాదికాలం నుంచి బి.సి. కులాలు, కులవృత్తులే ప్రముఖపాత్ర వహిస్తూ వస్తున్నాయి. బి.సి. కుల వృత్తులు వర్ధిల్లినంత కాలం గ్రామాలు స్వయంసమృద్ధితో కళకళలాడాయి. గ్రామాలను దేశానికి పట్టుగొమ్మలుగా నిలపడంలో కులవృత్తులదే ప్రధాన భూమిక. ఒకరి కులవృత్తి మిగతా అన్ని కులాలకు తన సేవలను అందించేది. అలా కులాలన్ని పరస్పరాశ్రితాలుగా ఉన్నాయి. అలా ఉన్నంత కాలం ప్రజల్లో ఆత్మీయాతానురాగాలు తొణికిసలాడేవి. మనమంతా ఒక్కటే అన్న భావనతో ప్రజలంతా ఉండేవారు. కానీ, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ చివరగా ప్రపంచీకరణ బి.సి. కులాలు కులవృత్తులను చిన్నాభిన్నం చేశాయి. ఒకనాడు వైభోగంతో విలసిల్లిన కులవృత్తులు నేడు తమ అస్తిత్వాన్ని వెతుక్కునే దశలో ఉన్నాయనడం అతిశయోక్తికాదు. సమాజపు బండి సాఫీగా సాగడంలో తమ జవసత్వాలను ఇంధనంగా అందిస్తూ తమను గురించి ఆలోచించడం మరిచిన బి.సి.కులాలు సహజంగానే వెనకబడిపోయి వెనకబడ్డ కులాలుగా ముద్రవేసుకున్నాయి. ఇది స్వయంకృతపరాధమే. అనైక్యత, చైతన్యరాహిత్యంతో రాజకీయ చదరంగంలో బి.సి.లు సైనికులుగానే మిగిలే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బి.సి.కులాల, కులవృత్తుల అస్థిత్వానికి అనేక మంది కృషిచేశారు. చేస్తున్నారు. వారిలో చైతన్య కలిగించి, అభివృద్ధిబాటలో పయనింప జేసేందుకు ఉద్యమిస్తున్నారు.

పైన పేర్కొన్న అంశాలన్నీ ఈ బి.సి.కవిత సంకలనంలో చోటుచేసుకున్నాయి. సమాజ పరిణామక్రమంలో బి.సి. కులాలు, కులవృత్తుల పాత్ర, కులవృత్తుల ప్రత్యేకత, కులవృత్తుల ప్రస్తుత స్థితి, ఉన్నతంగా ఎదిగిన బి.సి.లు, జ్యోతిబాపూలే గురించిన కవితలు మొత్తం బి.సి.ల గతాన్ని వర్తమానాన్ని మన కళ్ళముందు ఆవిష్కరింపజేస్తాయి. భవిష్యత్తుపై ఆశలను చిగురింపజేస్తాయి.

బి.సి.ల గొంతుకను బలంగా వినిపిస్తున్న ఈ 'బి.సి.కవిత' తెలుగు సాహిత్య చరిత్రలో మైలురాయిగా నిలుస్తుంది.

– సంపాదక వర్గం

విషయసూచిక

1. సమాజ పరిణామక్రమంలో బిసిల పాత్ర మరియు బిసి కులాలు, కులవృత్తుల ప్రత్యేకత

బి సి క వి త

2. బి.సి. కులాలు, కులవృత్తుల ప్రస్తుత స్థితి

బి సి క వి త

3. బి.సి. చైతన్యం – ఆవశ్యకత

4. వివిధ రంగాల్లో అత్యున్నతంగా ఎదిగిన మరియు ఆదర్శనీయులైన బి.సి.లు , వారి ప్రత్యేకతలు

5. మహాత్మా జ్యోతిబాపూలే

బి సి క వి త

1

సమాజ పరిణామ క్రమంలో బి.సి.ల పాత్ర మరియు బి.సి. కులాలు, కులవృత్తుల ప్రాధాన్యత

బి సి క వి త

1. నేనొక గొర్ల కాపరిని !

అవును... నేనొక గొర్ల కాపరిని
అమాయకత్వానికి ప్రతీకనై
దళారుల చేతుల్లో రెక్కల కష్టాన్ని ధారబోసి
నిజాయితీకి నిలువుటద్దమై బతికేటోన్ని
నోరులేని మూగజీవాలే నా ప్రపంచం
కలో గంజో తాగినా
ఖాళీ కడుపుతో మలమల మాడినా
జీవాలను మాత్రం
కంటికి రెప్పలా కాపాడే జంతు ప్రేమికున్ని
చదువు సంధ్యలకు దూరం చేస్తూ
నా పిల్లల భవిష్యత్తును పణంగా పెడుతూ
మందతోపాటు మన్యం పోయి
పాలమూరు నుండి నందికొండ దాకా
చంకలో గొర్రె పిల్లలతో నా పిల్లలు
అంధకారంవైపు సాగుతున్న ప్రస్థానం
సమాజానికి తినడానికి మాంసం
కట్టుకోవడానికి ఉన్ని చర్మాలు అందిస్తూ
నేను మాత్రం అర్ధాకలితో అర్ధ నగ్నంగా
ఎండనకా వాననకా చెట్టు పుట్ట చేను చెలక తిరుగుతూ
వృత్తి ధర్మాన్ని నిర్వర్తించే ఎత్తులు జిత్తులు తెలవనోన్ని
నేను సాదుకునే గొర్రెలమంద మూతి వాపులు దొబ్బ రోగాలతో
దొడ్డి నిండా అడ్డం పడితే కటిక వాళ్లు గద్దలై దొడ్డి మీద వాల్తరు
అడ్డికి పావుశేరు అగ్గువ సగ్గువకు తన్నుకు పోతరు
ఏడాదంతా కాయకష్టం చేసినా   నాకు మిగిలిన జీతం కన్నీళ్లే

– సాగర్ల సత్తయ్య
నల్లగొండ – 7989117415

బి
సి
క
వి
త

2. అతడొక శిల్పి

అతడు నేను లోనికి వెళ్ళినప్పుడల్లా
చిరునవ్వుతో ఎదురుపడి పలకరిస్తాడు
మహారాజులా నన్ను మెత్తని కుర్చీలో కూర్చోబెట్టి
అద్దం ముందు నా హృదయాన్ని ఆవిష్కరిస్తాడు
మాసిన నా హృదయాన్ని చూడగానే
సిగ్గుతో నేను అతని ముందు తలదించుకుంటాను
అప్పుడతడు
నా తలను మెల్లగా తన చేతుల్లోకి తీసుకొని
శిల్పిలా నా జుట్టును సుకుమారంగా చెక్కుతుంటాడు
నా జుట్టును చెక్కుతున్నప్పుడు
నాలో నిండుకపోయిన అహమంతా
ముక్కలు ముక్కలుగా తెగిపడుతుంటుంది
అతడి చేతులే కాదు అతడి మాటలు కూడా
నా మనసులోని మాలిన్యాన్ని కడిగేస్తాయి
కొద్ది క్షణాల అనంతరం
చివరిగా అతని చేతుల్లోంచి నేను
ఓ కడిగిన ముత్యంలా కుర్చీలోంచి దిగుతాను
అతడు ఎన్ని 'వేలు' పోసినా వెలకట్టలేని మనిషి
నిత్యం ఎన్నో రూపాల్ని అద్భుతంగా మలిచినా
తన జీవితాన్ని మాత్రం అందంగా మలుచుకోలేని
ఒకానొక నిస్సాహాయుడు

– బిల్ల మహేందర్
9177604430

3. దాతి కాడ !

నాన్నా! పెద్ద బాడిశెతో
తుమ్మ మొద్దులు చెక్కి చెక్కి
మొద్దు బారిన నీ చేతులు
మాకింత ముద్ద పెట్టాలని
ఎంతగా తపించేవి!
చిన్నప్పుడు జ్వరమొస్తే
నీ భుజాల మీద ఎక్కించుకొని
మైళ్ళకు మైళ్ళు నడిచి
ఆసుపత్రికి తీసుకెళ్ళిన
ఆ క్షణాలెప్పటికి మరువలేనివి!
నిరంతరం కొలమిలా
మండుతూ
మా జీవితాల్లో వెలుగు నింపిన
మా కుటుంబ కాంతి రేఖవి!
కడదాకా ఆ చెక్కల మధ్యనే
బతుకు సాగించినా
గంధపు చెక్కవై అరిగిపోయి
మా భవిష్యత్తుకు పరిమళాన్ని
అద్దిన నిరుపమాన త్యాగానివి
ముళ్ళ బాటలో నువ్వు నడిచి
మా కోసం
పూల బాటల్ని దారి
నిండాపరిచిన అలుపెరగని
శ్రామికుడివి
ఆ దాతి కాడ నీ చుట్టూ
ఊరి సేద్యగాళ్ళంతా గుమిగూడి
పనికోసం ఎదురు చూస్తూంటే
ఆ క్షణంలో నువ్వు నా కంటికి
వోజులా కాదు
రాజులా కన్పించేవాడివి
నీ చేతిలో పునీతమైన
బాడిశె, ఉలి, రంపం
సుత్తె, శానం, పట్టకారూ
ఒక్కటేమిటి
నీ తీపి గుర్తులుగా మిగిలిన
ఆ పని ముట్లన్నీ
నిన్ను గుర్తు చేసుకుంటూ
మాతో పాటుగా కన్నీటి చుక్కలు
రాలుస్తూనే ఉన్నాయి!

– వెన్నెల సత్యం
షాద్‌నగర్
9440032210

బి
సి
క
వి
త

4. ఇస్త్రీపెట్టె

ఎర్రెర్రనివి
ఎనిమిదేసి కళ్లేసుకుని
పక్కమీద
బుజ్జి కుక్కలా దూకుతుంది
మా ఇస్త్రీపెట్టె!
ముడతబట్టని చలువజేసే
దానిని చూస్తే
సంఘసంస్కర్తలు
కళ్లలో మెదులుతారు!
బట్టల్లోంచి
నాలుగుమెతుకులు రాలుతాయని
నాన్న అన్నప్పుడు అర్థం కాలేదు
నాలుగు శాల్తీలను ఇస్త్రీ చేసినపుడు
చేతిలో మోగిన
పైసలగంటల్ని విన్నాక
కొంచెం కొంచెంగా
బతుకు అర్థవంతమైంది!
బల్లమీద ఇస్త్రీచేస్తూ
ఒక్కోసారి పరధ్యానమైతే
చురకవేసి అప్రమత్తత నేర్పేది
పిల్లలొచ్చి ఇస్త్రీపెట్టెమీదా
నీళ్ళ చుక్కలు చల్లితే
కాక తగ్గిస్తారని కాబోలు
'చుయ్ చుయ్' మంటూ
చిరాకుపడేది!
సారంలేని బొగ్గులేస్తే
సుస్తీచేసినట్టు మందంగ నడిచేది
తుమ్మవో తాటివో
బొగ్గులేస్తే చూడాలి
మొద్దుబట్టమీద కూడ
లేడిపిల్లలాగ పరుగులు పెట్టేది!
మా ఇంట్లోనూ దేవుడున్నాడు
ఆయన ఇస్త్రీపెట్టె
అవతారమెత్తాడు
రోజూ నిద్రలేవగానే
దైవదర్శనంలా ఇస్త్రీపెట్టె దర్శనం!
చేసిన డిగ్రీలన్నీ
జీవనానికి ఖాళీగంపగా
మిగిలినపుడు
ఉద్యోగంకోసం
గాలిపటాన్నై తిరుగుతున్నప్పుడు
పిలిచి కొలువునిచ్చిన
ఈ ఇస్త్రీపెట్టె నా జీవితానికి
పెద్దవరమంటాను!
బతుకుదెరువును చూపించిన
ఈ ఇస్త్రీపెట్టె ఋణం
తీర్చుకోలేనని తెలుసు
కనీసం దాని అస్థిత్వాన్ని
తుప్పుపురుగు తినకుండా
ప్రేమగా చాలా బాధ్యతగా
పూలశాలువ కప్పి దాచుకున్నాను!

– మెట్టానాగేశ్వరరావు
9951085760

5. అముదాల మర్కపిల్లలు

ఇంటిముందు మొలిచిన
రెండు పూలమొక్కలా ఏమిటీ
ఈ అమడాల మర్కపిల్లలు
ఇవి చెంగుచెంగున దుంకుతూ
బతుకువాకిట్లో
బండారుతో పట్నమేస్తుంటే
ఒళ్ళంతా కళ్ళుంటే
బాగుండనిపిస్తుంది
కాళ్ళు, మెడ దొరికిచ్చుకొని
గెగ్గెలో వేసినపుడు
పెద్దమ్మకథలోని
కాటమరాజును
కండ్లముందట
చూస్తున్నట్టే ఉంటది
పచ్చని గరికపోసల్ని
కందిమండ కొనల్ని
లేత య్యాపరిల్లల్ని
గెగ్గె చుట్టు గజ్జెల
లెక్క వేలాడదీసినపుడు
వాయిలుకర్రల గెగ్గె
పసిబిడ్డల తొట్టెలౌతుంది
మేకపంచకం, మేకపెంట
మాకెప్పుడూ రొచ్చనిపించలేదు
పిల్లలకు అమ్మతల్లి పోసినపుడు
మేకపెంట పొగనే
ఇంట్లో అగరుదూపం
జాలమేక, పుల్లమేక
పెద్దమేక, బింగిచెవుల మేక
కనుకున్న బిడ్డలకు పేరు పెట్టినట్టు
మేకలకు ఎన్నిరకాల పేర్లు
పెదుతడో నాయిన
పదినగలై, ఇరవై నగలై
ఇంటిల్లిపాదిని
ఈ మేకలే సాదుతుంటయి
ఎక్కరాని గట్లకెక్కి
దిగరాని గట్లకు దిగి
నాయిన మేకలకాస్తుండంటే
ఈ మేకపాల గట్టిదనమే
తిప్పగమేసిన తల్లిమేక
బియ్యంకడిగిన నీళ్ళను
ఉరుకొొచ్చి గటగటా తాగుతుంటే
డొక్కలెండిన
నాయిన కడుపు కూడా నిండుతది
రెండు మేకపిల్లలతో పాటు
నేనూ దాని పొదుగు
ముందు మేకపిల్లనై
నోట్లోకి పాలు పిండుకుంటుంటే
ఈ మేకేమిటీ?
ముఖం మీద
నురుగు పూలను పూయిస్తుంది
తల్లిలాగ !!!

– తగుళ్ళగోపాల్
కలకొండ – 9505056316

బి
సి
క
వి
త

6. సృష్టికర్తలు

కం. కుండలు జేయును కుమ్మరి
బండను వడ్డెరలు జీల్చి భవనము గట్టన్
దండిగ పాడియు పంటలు
పండించును రైతు మెతుకు ప్రజలకు బెట్టన్ !

కం. బంగారము కరిగించియు
సింగారము చిందునటుల జేతురు సొమ్ముల్
రంగారు విశ్వబ్రాహ్మణు
లంగన మణులిష్టమొప్ప నద్భుత రీతిన్ !

కం. కుమ్మరి జేయును లోహపు
కమ్మరమున గాల్చియినుము కత్తులు, సుత్తెల్
గుమ్మము గొళ్ళెము కొడవలి
నిమ్మహి సృష్టించి నిచ్చు నింపెసలారన్ !

కం. జెక్కుచు వడ్రంగి కఱ్ఱను
మక్కువగా గృహము కొరకు మంచము, కుర్చీ
చక్కగ కిటికీ, ద్వారము
పెక్కుగ నాగళ్ళు, బండ్లు, పీటలు జేయున్ !

కం. వంటింటి పాత్రలన్నియు
గంటెలు, పళ్ళెములు, బిందె, గంగాలమునున్
నింటికి యవసర మయ్యెడి
కంటికి సొంపైన విధము కంచరి జేయున్ !

– **'ప్రతిభారత్న' మహ్మద్ షరీఫ్**
ప్రభుత్వ పాఠ్యపుస్తక రచయిత
సంగారెడ్డి – 9866560527

7. బి.సి.

చిన్నప్పుడు నేను ఎరుగను
బి సి అంటే ఏమిటో.. కానీ
మట్టికి రూపమిచ్చిన ఆధునిక బ్రహ్మలను చూసాను
పెళ్లిలో 'భజంత్రీలు భజంత్రీలు' అని పంతులుగారు అనగానే
సన్నాయి, డోలు సమ్మిళితము చేసి
మాధుర్య సంగీతాన్ని అందించే కళాకారులను చూసాను
ధగధగా మెరుపుల నగలు మలచి స్త్రీ సౌందార్యాన్ని
ద్విగుణీకృతం చేసిన స్వర్ణకారులను చూసాను
అగ్గిపెట్టలో పట్టుచీరను ఉంచి బహుమతిగా ఇచ్చిన
నేతకాళ్లు ఉన్నారని చదివాను
భారత చరిత్రను కనుగొన్న ఆనవాళ్లు
శిల్పాలు, పాత్రలు, నాణేలు అన్నీ
కళాకారుల పుణ్యమేనని తెలుసుకున్నాను
నేను శుభ్రంగా ధరించే బట్టలను ఉతికి ఇస్త్రీ చేసి ఇచ్చి
నాకు కేశాలంకరణ చేసి నన్ను ఆరోగ్యముగా ఉంచిన
స్వచ్ఛబంధులను చూసాను..
నేను తృప్తిగా భుజించే మీనములను ప్రాణాలకు తెగించి
సముద్రగర్భముదాకా వెళ్లి తెచ్చే అన్నదాతను చూసాను
నేను అమ్మగర్భంలో ఉన్నప్పటినుండి భూమిపై చేరే వరకు
అమ్మమ్మలా తోడున్న మంత్రసానిని చూసాను
ఇంకా ఎన్నో కళలకు, భారత సంస్కృతికి అద్దంపట్టిన
ఎందరో బి.సి కళాకారులను
భారత్ కల్చర్కు ప్రతినిధులు అని
కొత్త భాష్యం చెప్పుకోవడానికి గర్వపడతాను..

- అన్నాప్రగడ వేంకట నరసింహారావు
9390099056

బి సి క వి త

8. నేతన్న !

పద్మశాలి వోయి
    ప్రగతి సాధించ వోయి
అందరికీ వస్త్రాల నందించే
    నేతన్న వోయి
గిట్టుబాటు ధర రాలేదని
    నిరాశ చెందకోయి
గుండె ధైర్యం చెడ కోయి
    నిండు గుండె నీదోయి
ఆత్మ హత్యలు నీకు కాదోయ్
    అందరికీ నీవు ఆదర్శ మోయ్
కులములో ఏమున్నదోయ్
    గుణములోనే ఉన్నదోయ్
గుణము చెడిన కులము కాదోయ్
    మనిషిగా మెలగ వోయ్
మనసున్న మనిషిగా వెలగవోయ్
    ఇంటి దీపం నీ వోయ్
ఇంటిల్లి పాలిట
    కల్పవల్లి వోయ్
పద్మశాలి వోయ్
    ప్రగతి సాధించవోయ్

దోజశ్రీ - దోమల జనార్ధన్
విశ్రాంత ఉపాధ్యాయులు
న్యూ పన్వేల్, నవీ ముంబై
జిల్లా : రాయగడ్, మహారాష్ట్ర - 410206.
9702588946

బి
సి
క
వి
త

9. పద్మశాలి ఖ్యాతి

పద్మమున జనియించిన
పద్మావతి వంశస్థులు
లయకారుడి వంశీయులు
మహావిష్ణువుకు మెట్టినిల్లు
పద్మము యొక్క గుణములు
కలిగిన వారు
ప్రకాశవంతమైన తేజస్సు
కలిగినవారు
సృష్టి కర్త బ్రహ్మకును
ఆరోగ్యదాత ఆదిత్యునికును
మనుమలు, మనవరాలులైన వారు
భగవంతుడికి ప్రీతికరమైన వారు
నేతతో నాగరికతను పెంచేవారు
భృగుమహర్షి బంధువులు
పేదరికానికీ బెదిరిపోని వారు
అనురాగాలకు ఆత్మబంధువులు
నగదును తన స్థాయిలో
నలుగురికి పంచేవారు
ప్రతి ఒక్కరిలో ప్రేమను చూసేవారు
పలకరింపుతోనే పండుగలను
తెచ్చేవారే కదా మన పద్మశాలిలు

– బొడ్డు హారిక
కలం పేరు :– కోమలి
రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్
9121531864

10. అల్ప సంతోషి

మేధస్సులో మేలిమి బంగారం
రెక్కలే అతని జీవన సంగ్రామానికి మూలాధారం
సన్నని దారపు పోగులతో నిత్యం చెలిమి చేసే
బహు చక్కని చెలికాడు
అతని పనితనంతో తళుక్కుమంటున్న
వలువలు అతివల అందాన్ని
ఇనుమడింపజేస్తున్నాయని పొంగిపోయే అల్ప సంతోషి
అగ్గిపెట్టలో ఆరుగజాల చీరతో
పరదేశపు రాణిని సైతం అబ్బుర పరచిన అసామాన్యుడు
నేతన్నా! అనే ఆత్మీయ పిలుపుకు పులకిస్తూ
డొక్క ఎండి ఆకలి పేగుల దరువుతో దడదడ లాడిస్తున్నా
లెక్కచేయక జాతికి తన శ్రమను ధారబోసే త్యాగశీలి
పచ్చిపులుసే పరమాన్నంగా
చుట్టమొచ్చిన నాడే కాసింత కమ్మని కూరతో
కడుపు నింపుకునేనంతటి పేదరికములో కొట్టుమిట్టాడుతున్నా
మనసుకు మాత్రం పేదరికం దరిచేరనీయని సంపన్నుడు
శారీరక శ్రమతో దరిద్ర దేవతని దారి మళ్లించగల ఉద్దండుడు
కడగండ్ల గంపని తలపై మోస్తూ
కన్నపిల్లలను కష్టాల కడలి దాటించి
చదువులమ్మ ఒడిలో ఓలలాడించి
విదేశాలలోను గనుతి కెక్కిన ఘటికుడు
ఎవ్వరితోనైన ఇట్టే నెయ్యము గావించి
నేర్పుగ నెట్టుకు రాగల మమతల పందిరి

- ఉప్పల పద్మ
మిర్యాలగూడ,
నల్లగొండ జిల్లా - 8340933244

11. సజ్జన బి.సి.

వ్రతముగ చదువే చదివిన
బ్రతుకను నౌకర్లు లేక బలిజీవితమై
ప్రతి నిత్యము తిప్పలు తో
బ్రతుకున కిరకాటముగను బ్రతికెను బీసీ

ఉన్నత పదవులు దొరకక
చిన్న పదవి దరికి రాక చేసెను వృత్తిన్
నన్నము పెట్టెడి కులమున
మిన్నగ తా బ్రతుకుతున్న మేలిమి బీసీ

చెలిమిగ జన సౌలభ్యము
సులభముగా తీర్చ నెంచె సూక్తి ప్రదాతా
కులవృత్తులు చేపట్టిన
ఫలితము లను పొందలేని పౌరుడు బీసీ

సత్తువతో పని చేసెడి
వృత్తులు దిగజారకుండ భృతినే కూర్చన్
నత్తల కులవృత్తి జన వి
పత్తులకండగ నిలిచిన బ్రతుకును బీసీ

పెక్కు కుల సమూహముతో
మక్కువ గలపెద్ద కులము మరియేదనినన్
తక్కువ నెక్కువ గాకను
చక్కుమనుచు మెరియుచుండు సజ్జన బీసీ

– మమత ఐల
హైదారాబాద్ – 9247593432

12. ఉర్వి మీదే ! ఉత్పత్తి మీదే !

ఉర్వి మీదే, ఉనికి మీదే
ఊపిరిపోసిన వృత్తులు మీవే
ఉత్పత్తి పరిశ్రమ యంత్రము మీరే
కారే చెమట చిందె రక్తం
కార్యసాధనకు కర్తలు మీరే
కళలు మీవే కళాకృతులు మీవే
కలాలు మీవే స్వరాలు మీవే
కార్మిక కర్షక గళాలు మీవే
చక్రం, కుండ – చల్లటి కూజా
కొడవలి సుత్తె – కొలిమిలో నిప్పులు
చేనేత వస్త్రం – సన్నని చీరెలు
చెప్పులు డప్పులు – చర్మపు ఒరలు
బట్టల శుభ్రత – బంగారు ఇస్త్రీ
నాగలి గొర్రు – కాడెడ్ల బండి
తెడ్డు గూటం – తెలిచాప రూపం
పాపిట బిళ్ళ – పడతికి పుస్తె
శరీర కవచం – చక్కని క్షౌరం
మేడలు మిద్దెలు – మేటైన దారులు
నాజూకు శిల్పం – నాజూకు గోపురం
గొర్రెలు మేకలు – పశువుల పోషణ
అంతట మీరే – అన్నింటా మీరే

– శివాజీ రవీందర్

కలం : సురవి – 7893135820

బి
సి
క
వి
త

13. చైతన్య శిల్పులు

ఆర్థిక స్థోమతలేక
ఆధునిక పరికరాలు కొనలేక శీతల క్షౌరశాల పెట్టలేక
కుటుంబ పోషణార్థం నమ్ముకున్న కిరాయి కొట్టునే
బతుకు బండిగా లాగుతున్న చైతన్య శిల్పులు క్షురకులు
పసిపిల్లల నుండి పండు ముదుసలి వరకు
అందరి కేశములను అందంగా అలంకరిస్తారు
వినియోగదారుల నోరు, ముక్కు, చెవులు, చంకలనుండి
ఎంత దుర్వాసన వస్తున్నా, దీర్ఘ రోగాలెనున్నా
మోముకు మోము ఎదురుంచి బతుకుదెరువుకోసం భరిస్తారు
ఇంట్లో మంచాన పడివున్న రోగుల మలమూత్రాల దుర్గంధం వస్తున్నా
ఊపిరి బిగపట్టి మంచాన్నే క్షవరం చేసి తలబరువులు దింపి,
కాలుచేతులు గోర్లు తొలగించే మానవత్వమున్న
మంచి సేవకులు నాయీ బ్రాహ్మణులు
దేవాలయాల్లో, జాతరల్లో, శ్మశానాల్లో, దుబ్బ, ధూళి, చుండ్రు,
పుళ్ళు, కురుపులు, మచ్చలు ఉన్న తలలను శుభ్రపరుస్తారు
కొందరు మద్యం సేవించివచ్చి తలంతా వొళ్ళంతా మర్దన చేయించుకొని
అంతెందుకు ఇంతెందుకని ఎంతో కొంత చేతిలో పెట్టి
వెనుదిరిగి చూడకుండా వెళతారు
ప్రభుత్వం ఇస్తామన్న ఆర్థికసాయాలు అందని ద్రాక్షగానే ఆగిపోయాయి
కష్టానికి తగిన ఫలితంరాక ఆర్థిక ఇబ్బందులతో
సతమతమవుతూ దు:ఖాన్ని దిగమింగుతూ
కన్నీళ్ళను ఖర్చీఫ్ వెనుక దాస్తు దిగాలుగా దిక్కులు చూస్తున్న
ఈ చైతన్య శిల్పుల కష్టాలు, కన్నీళ్ళు కడతేరేదేనాటికో ..

– గరిదేపల్లి శోభనాద్రి
ఖమ్మం – 8897785495

బి సి క వి త

14. రోదన'గీత'మ్

పొడిచే పొద్దుకి ముందే లేచి
కావడి బద్దకి కుండలనేసి
కాలినడకతో వనమున జేరి
జారే నడుముకి మోకుని జుట్టి
రెండు కాళ్ళకి గుయ్యిని కట్టి
నవనాడులనే నిచ్చెన జేసి
తీటిగొలకు నెరుసుని వేసి
కత్తులు నూరి గొలను గీసి
శ్రమని మరిచే సురని తీసి
వానకి తడిసి ఎండకి ఎండి
ఆకలి విడిచి దప్పిక మరచి
కల్లుని అమ్మే మండువలోన
వచ్చే సొమ్ముకై ఆశతో చూసి
పారె ఆశల ప్రవాహ ఝరిలో
మేనుకి మోయని గాయాలతో
కాయమంతటా మాయని గురుతులతో
రాత్రి రాజ్యమేలు లిక్కర్ ధాటికి
ఒరవక నిలవక తూలే తాడిని
నమ్ముకు బతికే గౌడును నేను

– బండారి ప్రేమ్‌కుమార్
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ
తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల
హైదరాబాద్ – 9492788752

15. వైద్యవేత్త

గౌడు యెప్పుడైన గౌరవా రూపుడే
వేదజ్ఞానమున్న విబుధవరుడు!
కాలధర్మగతుల కర్తవ్యకాంతిగా
మధుర రసముపంచె మాధవుండు!!

మానవాళిమదిన మలినాన్ని తుంచేస్తు
ఈశుని హృదినమ్మి దీప్తిగాంచు!
శాంతిసౌఖ్యములను సంఘానికందిస్తు
చెట్లసురను పంచు లొట్లరేడు!!

ఈత తాటికల్లు యింపుగా రేకలో
తాగితేనె దేహ కాంతి మురియు!
రాళ్ళుకరగదీసె రాజమంత్రమిదియే
సర్వరోగహరిణి సాకమొక్కు!!

శస్త్ర చికిత్సజేస్తు శ్రమలకల్లునుదీసె
వైద్యవేత్త వృత్తి విధియురాత!
అంతరాత్మమథన మానందలోలుందు
తన్మయత్వమున్న తాత్వికుందు!!

విశ్వరూపుజూపి విష్ణుదే కృష్ణుడై
గీతసారమిచ్చి వెతలుబాపె!
తాటిచెట్లునెక్కి తావిష్ణురూపుడై
బంధుజనుల గలుపు భాగ్యుడితడు!!

కాళ్ళబంధమేసి కరము సత్తువజూపి
ఉదుతవోలెనెక్కి ఉరుకులాడు
మోటుసరసవరస మోకుముస్తాదులే
నవ్య నాగరికము నవ్వురేడు!!

– డా. పాందాలమహేశ్వర్
గోసుకొండ, పోచంపల్లి, యాదాద్రి – 9912180054

16. బహుజన స్త్రీ

మానవ పుట్టుకకు మరో బ్రహ్మవై
పురిటి నొప్పుల తల్లికి పునర్జన్మనిచ్చి
పురిటి శిశువుకు పురుడు పోసి
బాలారిష్టాలు పోను బాలింతను బాయికి తీసి
చుట్ట పక్కాలకు ముదమునిచ్చి
మురిసి పోయే మంత్రసాని నీవే

మైల బట్టని మదన పడక
మానవుని మానం నిలుప
"పతీలా" కింద పొరక మంటబెట్టి
సౌడు సున్నంతో ఉడికిచ్చి
పరుల పరువుకే పరువు తెచ్చిన
చిరునవ్వుల చాకలి వనితవు నీవే

చింత నిప్పుల కమ్మరి కొలిమి లో
కుత కుత ఉడికిన ఇనుముపై
పోటు మీద పోటు సమ్మెట పోటువై
పలుగు, పార, కొడవలి, కర్రు, కత్తికి
కదురూపమిచ్చిన కమ్మరి స్త్రీ నీవే

అడవంత తిరిగి ఆకు ఆకు కూర్చి
దండ్యాలు కుచ్చి ఎండ బెట్టి
పసరంత పోయి పండాకుకాగ
సొప్ప పేడుతో కుట్టి
పంచ భక్షపరమాన్నాలకు ఇస్తరాకువై
విస్తరించిన తమ్మలి స్త్రీ నీవే

చెట్టు దిగిన కల్లును కాటమయ్యకు
సాక పోసి నీరెండన నీర దీసి
పండుతాడు, పరుపుతాడు
పోతుతాడు కల్లని
అలసిన దేహాలకు ఆకులో
అమృత ధారవై నిలిచిన పడతి నీవే
జల్లలు, రవుటలు, బొౌచ్చెలు
కవిశలు, కొడిమలు, కొౖరమట్టలని
కవుసు నీసనక గంప నెత్తిన పెట్టి
బస్తి బస్తీ తిరిగిన బెస్త స్త్రీ నీవే
ఎండనక వాననక
చెట్టు చెట్టు తిరిగి
చెట్టెక్కి, పుట్టెక్కి, గుట్టెక్కి
ఈ కాయ ఆ కాయనక
ఆ పండు ఈ పండనక
పల్లె నుండి పట్నం దాక
పండ్లమ్మిన పడతివి నీవే
నీ కాలు ఊనని నేల లేదు
నీవు కలువని చేను లేదు
పట్టిన పిడికిలి మట్టిన ముంచి
కైకిలితో కల్లం చేసి
పట్టెడన్నం పైకి తెచ్చిన
పూటకు కూడు లేని
నిరుపేదవు నీవు
సారెనెక్కి నీడనారిన కుండ
నీ చేతి సల్పా దెబ్బకు చక్కబడి
ఆవం మంటన
అపురూప కళాఖండమై
నీ చేతి సున్నపు చుక్కలు
జాజు బొట్లతో అయిరెండ్ల కుండవై
పెళ్ళి పందిరిన కొలువైన
కుమ్మరి కొమ్మవు నీవు
పోగు పోగు పోలు దిరిగినట్లు
ఆసు మీది దారం
నీ చేయెంట తిరిగి
అంగనల అందం ఇనుమడింప
అతి సుందరంగా అద్దకములద్దిన
సాలెల మగ్గం మెక్కి
మగువల మనసు దోచిన
ముదితవు నీవే
అంబట్యాలకు
గోర్ల మంద లేవగానే
అంబటి గంప నెత్తినెత్తి
అడవంత తిరిగి
కుంటి గొౖరెను ముందుకునూకి
ఈతేసిన గొౖరెను ఇంటికి చేర్చి
మరగని గొౖరెను మరిగిచ్చి
మందదుగంత మంచిగూకి
మండదెచ్చి గెగ్గతట్టకెట్టి
మేతలేక మందంత మేపులకు పోతే
గోర్లెంట వెళ్లే గోల్ల కురుమ
కొమ్మవు నీవే
సమాజంలో సంపద సృష్టించ
శతాధిక అవతారికవై
ఈ సృష్టికి పరిపుష్టిని నిచ్చిన
ఓ బహుజన స్త్రీ
నీకు వెన వేల శరణార్థులు

– ఎడ్ల కల్లేశ్
9866765126

17. శ్రమజీవులం

వెనుకబడిన వాళ్ళం కాదు
ముందుండి సమాజాన్ని నడపించే వాళ్ళం
కాయకష్టం చేసే వాళ్ళం
కష్టసుఖాలు యెరిగిన వాళ్ళం
కులవృత్తులనే కులదైవంగా నమ్మేవాళ్లం
కష్టపడ్డ సొమ్ముతో కడుపు నింపుకునే వాళ్ళం
వెనుకబడిన వాళ్ళం కాదు
ముందుండి సమాజాన్ని నడపించే వాళ్ళం
మాసిన రూపాలకు మెరుగులద్దే వాళ్ళం
మలిన దుస్తులకు మేలిమి తొడిగే వాళ్ళం
మట్టి ముద్దలకు ఆకృతుల్నిచ్చే వాళ్ళం
కఠినశిలలకు సైతం రూపాల్నిచ్చే వాళ్ళం
పాడిపంటలకు పాటుపడే వాళ్ళం
తాటి చెట్టు ఈత చెట్టు యెక్కే వాళ్ళం
బతుకు బాటలో తలెత్తుకుని తిరిగే వాళ్ళం
వెనుకబడిన వాళ్ళం కాదు
ముందుండి సమాజాన్ని నడపించే వాళ్ళం
కష్టాలకు, కన్నీళ్లకు వెరవని వాళ్ళం
జనాల మధ్య శ్రమజీవులై తిరిగే వాళ్ళం
కళలకు చేయూతనిచ్చే వాళ్ళం
కళారంగాల్లో రాణించే వాళ్ళం
నాగరికతకు నడకలు నేర్పిన వాళ్ళం
దేశానికి పట్టుకొమ్మలై నిలిచే వాళ్ళం
వెనుకబడిన వాళ్ళం కాదు
ముందుండి సమాజాన్ని నడిపించే వాళ్ళం

– డా. తుమ్మల శ్రీనివాసులు
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, తెలంగాణ సారస్వత
పరిషత్ ప్రాచ్య కళాశాల,హైదారాబాద్. – 9704129872.

18. జీవిత నేతగాడు

సప్తవర్ణయుత వస్త్రం
భూమిని పరుచుకున్న ఇంద్రధనుస్సు
మన జీవితంలోని ప్రతి లక్షణాలని
ప్రతి రంగులోను చూపుతాడు
నేతలోని ప్రతి రంగు ప్రతిబింబిస్తుంది
అవి పురివిప్పిన నెమలీకలు
ప్రకృతి ప్రసాదించిన వెలుగులు
విశ్వమానవ ప్రతిరూపాలు
ఆసు త్రిప్పేటప్పటి కర విన్యాసాలు
చిటికలప్పటి వ్రేళ్ళ నాట్యాలు
వీక్షణాలకు వెన్నెలంటి హాయినిస్తాయి
గుంటలోని పాదాలు ఓ కథక్ లవుతాయి
సంపూర్ణంగా అతనో నాట్యాచార్యుడు
నేతన్నకెంత పొగరంటే
మనందరి మానం కాపాడుతున్నంత
ఎంత చక్కటి న్యాయాధిపతి అంటే
మనసంతా పోగేసి సరి జేస్తున్నంత
రంగుల రాజ్యాన్ని ఏలుతున్న రారాజు
ఈక్వేషన్లతో వాటిని మిశ్రమించే శాస్త్రజ్ఞుడు
కొత్త డిజైన్లు సృష్టించే మాయల మార్మికుడు
కండలు కరుగుతున్నా కండేలు ఎగురవేయగలడు
మనిషికి మనిషికీ మధ్య వున్న జీవితసత్యాలు
ప్రాణాళికాబద్ధపు నైపుణ్య బంగారు కరకమలాలు
మానవతకు మరో రూపాలు మగ్గంపైని నేసిన నేతలు
మానవాళికి మార్గదర్శకుడు జీవిత నేతగాడు.

– ప్రసాద్ తుమ్మా
హైదరాబాద్ – 9985438002

బి
సి
క
వి
త

19. ప్రగతిబాట

సీ. నేతలు మగ్గము నేయకున్న జనుల
కట్టు బట్టలు లేవు గతములోన
కుమ్మరి మట్టితో కుండలు చేకున్న
వంటపాత్రలు లేవు వసుధలోన
కంసాలి చేసిన కమ్మలాభరణాలు
ఆడవారల కెంతొ అవసరంబు
రాజు రౌతుల కైనా రజకుడే మాసిన
బట్టలుతకబెట్టి బరగు వాడు

తే.గీ. అట్టి కులవృత్తులకు దీటు అవని లేదు
చెప్పె గువ్వల చెన్నుడు చెన్నముగును
కాన వృత్తి పనుల వారి ఘనత చాలా
ప్రగతి బాటకు పూవుల పంది రేసె

ఆ.వె. అట్టి పనుల కిపుడు ఆధునికము వచ్చి
పవరు పనులు చాల ప్రబలి పోయి
కులపు పాదులెల్ల కూలదోసెను కాన
బడుగు వారి బ్రతుకు భార మయ్యె

– వై.నాగరంగయ్య
తాడిపత్రి, అనంతపురం జిల్లా – 9866068240

20. అపురూప దృశ్యాలు

అదో అందమైన నృత్యంలా కనిపించేది
మట్టిపై కాళ్ళతో ఆగకుండా తొక్కుతుంటే
కన్నార్పకుండా చూసేదాన్ని ఆ అడుగుల సోయగాలను
మట్టి ముద్దను ఇరుసుపై పెట్టి చక్రాన్ని తిప్పుతూ
అనేక ఆకృతులు కల్పిస్తుంటే అబ్బుర పడేదాన్ని
అంత నైపుణ్యం ఆ చేతులకెక్కడిదో అని
ఒద్దికగా కుండలను ఆరబెడుతుంటే
సూరీనికి జాగ్రత్తలు చెప్పేదాన్ని
మెల్లగా కిరణాలతో తాకమని
వరుణిడిని వేడుకునేదాన్ని
మరోసారి రా ఇపుడైతే మరలి వెళ్ళని
ఆరిన కుండలను అపురూపంగా సూలకేసి
అందమైన రూపమిచ్చేవారు కుమ్మరులు
కుండలన్నీ అమ్ముడుపోయి
ధాన్యంతో నిండేది వారి లోగిలి
చిన్ననాడు నేను చూసిన ముచ్చట్లివి
ఇప్పుడసలు ఏ పల్లెలోను
కంటికి కనిపించని అపురూప దృశ్యాలు
మాయమైన కులవృత్తులతో
జీవనాధారం కోల్పోయిన బతుకులు
దీనంగా కనిపిస్తున్నాయక్కడ
చేతి వృత్తుల కళాకారులు వారు
అందమైన ఆకృతులకు జీవం పోస్తున్న శిల్పులు
మళ్ళీ కనిపించాలి ఆ వైభవం ప్రతి పల్లె లోనూ
ఇకనైనాచేయూత నివ్వాలి
ప్రభుత్వంతో పాటుగా మనందరం
వృత్తులు అంతరించి పోకుండా
వృత్తి కళాకారుల జీవితాలు అడుగంటి పోకుండా..!!

– ఎం.ఎస్.శాంతి కృష్ణ
హైదారాబాద్ – 9502236670

బి
సి
క
వి
త

21. పల్లె సేవకులం

మంగలోళ్లం మేం మంగలోళ్లం
పల్లే తిరిగి చెసే సేవకులం
గుర్తించక పరిమలించ నోళ్లం
తూర్పు తెల్లారంగ అస్పె సంకా కేసి
పొదుముకే దంక గేరి వాడా లేగి
ఇల్లిల్లునూ తట్టి ముస్సల్లోలకు జేస్తె
క్షవరాల సేద్యాన గింజెల్ల నోల్లం
ఊర్లూ పంచుకొని ఉల్లాస పడ్తిమి
ఇండ్లు పంచుకొని సంతోష పడ్తిమి
ఇల్లిడ్పు మాదాని ఏడాదంత జేస్తే
తాలు కుంచే డీస్తె కడుపెండి నోల్లం
సిక్కు లిప్పదీసి నెత్తి గడ్డం జేసి
కాళ్ల గోర్లూ దీసి వొల్లంత రుద్దినా
కష్టానికి తగ ఫలిత మడగా బోతె
పక్కలిరగేసినా దిక్కు లే నోళ్లం
నెత్తి పుడ్లను కొరిగి రొమ్ము గడ్డల కోసి
యాపాకు నుడికించి రాచపుండ్ల గడిగి
రస దినుసులా మందు రుద్ది నయమూ జేసి
షాతవడి రద్దిని మొసి సచ్చి నోళ్లం
ప్రభుత్వ ఫలాలు అందరు మేస్తుంటే
సవితి పల్లల తీరు చూస్తుండి నోళ్లం

– రాసామొళ్ల చంద్రయ్య
అప్పాయపల్లి – 7981781349

22. క్షౌరం

మంత్రసాని పురుడు పోస్తేనేకదా
మన అయ్యవ్వలు కన్ను తెరిచింది
మంగళవాయిద్యాలు మోగితేనేకదా
మనపెండ్లికి కళ వచ్చేది
పొద్దెక్కకముందే గడ్డాలు గీయించుకుంటేనేకదా
నీటుగాడిలా బీటువేసేది
ఆ దువ్వెనసాలు నడిస్తేనేకదా
నిక్కపొడుచుకున్న వెంట్రుకలు సాగిలపడేది
ఆ పరపరలకత్తెర నాట్యం చేస్తేనేకదా
జుంపాలజుట్టు కుదురుగా కూర్చునేది
ఆ క్షౌరపుకత్తి తళతళా మెరిస్తేనేకదా
బొచ్చుగుండు బోడిగుండయ్యేది
గోరుగల్లు గొప్ప వాడిగా ఉంటేనేకదా
ముళ్ళేకాదు గోర్లూ ఆనెలూ తెగకోసేది
పెండ్లి బాసింగాలేకాదు చావుకర్మకాండల్లోనూ
దేవుడి ఊరేగింపుల్లోనూ వైద్యసేవల్లోనూ
నాయీబ్రాహ్మణుడులేకుంటే తరుణోపాయమేలేదు
కాని, ప్రపంచీకరణ సునామీలో
క్షురకం గందరగోళానికి గురిఅయింది
ఓటుబ్యాంకు రాజకీయం అభివృద్ధిని మింగేసింది
ప్రజాస్వామ్యరీతిలో నాయకుల వక్రబుద్ధిని
తక్షణం క్షౌరం చేయాల్సిందే !

– డా.గౌరవరాజు సతీష్ కుమార్
వనస్థలిపురం, హైదారాబాద్ – 9866757278

23. చేనేత మొగ్గలు

నరాలను దారాలుగా మలిస్తేనే కదా
అందమైన వస్త్రాలను రూపొందించేది
నాగరికతకు చిహ్నం నేతన్న నైపుణ్యం

మనదేశ చేనేత ప్రగతియే కదా
అగ్గిపెట్టెలో అమరే చీర నైపుణ్యం
చేనేత కళకు ఖండాంతర కీర్తి

ఇంటిల్లిపాది నిత్యం శ్రమిస్తేనే కదా
నూలుదారం వస్త్రరూపంగా మారేది
నేతన్న కళలు సంస్కృతికి దీపికలు

సాంకేతిక విజ్ఞానం ఆగమిస్తేనే కదా
చేనేత మగ్గం చతికిలపడి శిథిలమైంది
అదుపు తప్పిన నేతన్న బతుకు పగ్గం

జీవనాధారమైన నేతవృత్తే కదా
భావిజీవితాన్ని బుగ్గిపాలు చేసేది
రెక్కాడితేగాని డొక్కాడని బతుకు నేతన్నది

విదేశీ వస్త్రాలపై మోజుపడితేనే కదా
నూలు వస్త్రాలు ఆదరణ కోల్పోయేది
ఇది ప్రపంచీకరణ మాయాజాలం

మరమగ్గంతో తయారైన వస్త్రమే కదా
స్వేదంచిందించి నేసిన వస్త్రాన్ని తోసిరాజంటోంది
పోటీ ప్రపంచంలో కనుమరుగవుతున్న నేతన్న

నేతన్న చేతిలో రూపుదిద్దుకున్న వస్త్రమే కదా
ఆత్మగౌరవాన్ని హుందాతనాన్ని ఇచ్చేది
నేతన్నల జీవితాలు చిరిగిన బతుకులు

– పులి జమున
8500169682

బి సి క వి త

24. వజ్ర కిరీటాలు

సకల కులాల సమిష్టి కృషియే సమాజం!
అన్ని వృత్తులవారు అందించేదే మహాబలం!
దేశమంతా గ్రామాలు పల్లెలు గూడేలు తండాల మయమే!
అన్న మయములైన అన్ని జీవాలకు ప్రధానమైనది వ్యవసాయమే!
క్షురకర్మలు చేయడంలో దిట్టలు శుభకార్యంలో వారు డివిటీలు!
మంగళ కార్యాలు చేయువారు మంగలి వారు!
శ్రీకృష్ణుని వారసులం సమాజంలో గౌరవమైనది గొల్లకులం!
ఈతవనం తాటివనం గౌడ కులం వారికి ఉపాధి జీవనం!
సకల రోగ నివారిణి ఈ కల్లు ఔషధ గుణమని అన్నారు పెద్దలు!
విజయనగర రోజులే ఈ ముదిరాజులు!
అన్ని ప్రాంతాలలోని వారు సమిష్టిగా ఉండే వీరులు!
పద్మం వికసించే పరిమళం రంగుల రాట్నం పై దారాలం!
మార్కండేయ వారసులం అందరికి మేము సుపరిచితులం!
కలిమి వేములు కావడి కుండలు బ్ర తుకు నేర్పింది కుండలు!
శాలివాహన జాతికి చెందిన వారం
ప్రతి గ్రామానికి కుమ్మరులు మరో వరం!
చదివిన వాని కంటే చాకలి మేలు
పచ్చని పందింట్లో వీరు చేసే శుభకార్యాలు!
మయసభ శిల్ప చాతుర్యం జగమెరిగిన శిల్ప విశేషం!
వడ్రంగుల నైపుణ్యం రైతు నాగలి ఔన్నత్యం !
సమాజంలో వెనకబడిన తరగతుల వారి జీవితాలు!
కుల నైపుణ్యంతో కూడిన వజ్ర కిరీటాలు! ఈ కుల వ అత్తులు.

– ఉమ్మన్నగారి కృష్ణా గౌడ్
తలెల్మా, మండలం: ఆందోల్
సంగారెడ్డి – 9492303186

బి సి క వి త

25. పుడమికి మిత్రులు

అందమైన గ్రామం
ఆహ్లాదభరితమైన వాతావరణం
పొద్దు తొడుగుకుంటున్న
భానుని సుందర కిరణదర్శనం
కొండకొమ్మన మేఘం
వెళ్తున్న దృశ్యం ఒకెత్తైతే
పొద్దుపొద్దున తాటిచెట్లెక్కె యాతన్న గీతాలు
గొర్రెల మందలతో యహే యహే
అనే యాదన్న మాటలు
చాకిరేవు బండకాడ రజకన్న చేసు ఊసులు
నారుమడి కాడ రైతన్న బాసలు
ఆయుష్షును పెంచే
ఆకుకూరల పొందర్న పోకడలు
మట్టికి రూపాన్నిచ్చే కుమ్మరన్న చేతలు
కర్రలకు ఆకృతినిచ్చే విశ్వబ్రాహ్మణ శిల్పులు
ముల్లు గుచ్చుకున్న కాలును
హృదయానికి హత్తుకుని
అప్యాయంగా ముల్లును తీసే
నాయీ బ్రాహ్మణుని మాటలు
పోగు పోగు కూర్చి వస్త్ర రూపన చేసే
చేనేతన్న నేర్పరితనాలు
ఇవన్నీ గ్రామీణ జీవనంలోని
మధురమైన సుందర దృశ్యాలు
పుడమి తల్లితో వారికి పెనవేసుకున్న
అనురాగపు బంధాలు
ఎక్కడ? నేడెక్కడ?

- బూరి యోగీశ్వరరావు
తెలుగు భాషోపాధ్యాయులు, శ్రీకాకుళం - 7702293899

2

బి.సి.

కులాలు, కులవృత్తుల ప్రస్తుత స్థితి

బి
సి
క
వి
త

1. స్వర్ణకారులు

అందమైన డిజైన్లతో
అతివలకు మరింత
అందాన్నిచ్చేదెవరు?
బ్రహ్మ సృష్టికే అందని
సుందర సువర్ణాలను
కళాఖండాలుగా మలిచేదెవరు?
రేయి పగలు రాయిలా కూర్చోని
వృత్తినే తపస్సులా
ధ్యానించే రుషులేవరు?
సువర్ణ శకాలాలలో
తమ స్వప్నాలు పండించుకునే
స్వర్ణకారులు కాకమరేవరు!
చిన్న చిన్న ముక్కలను పోగు చేసి
చుక్కలతో ఆకాశాన్ని కలిపినట్లు
చక్కని ఆభరణాలేన్నో చేస్తారు
అద్భుత కళాఖండాలతో
ప్రతి సృష్టి చేస్తారు
రంగు రాళ్ళే వారి దైవాలు
ఉంగరపు వేళ్లే వీళ్లకు ఆత్మీయ నేస్తాలు
సుత్తుల మోతలే వీరు వినే సంగీతం
గోలసుల అల్లికలే వీళ్ల నిత్యకృత్యాలు
వీరి హస్తాలలో చేరిన తర్వాతనే
లోహాలు విలువైన స్వర్ణాలవుతాయి
కుంపటి వేలుగులోనే
వారు సూర్యోదయం చూస్తారు
తాము వేలిగించే అగ్ని దేవుడితోనే
ఆకలి మంటలను నివేదిస్తారు
తరుగుతోనే తన జీవితాన్ని
మెరుగు పరుచుకుంటారు
పనులేలా వున్నా మొహంపై
మందహాసం చేరగనివ్వరు
ఏవరేమనుకున్నా మేనుపై
దర్జాను పోనివ్వరు
తమని నమ్మని
అనుమానపు చూపులు
తమని ప్రశ్నిస్తున్న బెదరిపోరు
నిప్పురవ్వల కాంతులలో
మండుతున్న బంగారంలా
కాలపరీక్షలెన్నో ఎదుర్కోంటారు
నమ్మకానికీ గీటురాయిగా నిలుస్తారు
పరదేశ యాత్రికులు తమ
వృత్తిలో పాతుకుపోయినా
తమ ఉపాధికే అడ్డు తగులుతున్నా
తల్లడిల్లుతారే గానీ లొల్లి చెయ్యరు
ఆధునిక జ్యువల్లర్స్ పేరిట
వ్యాపార సంతకాలవుతున్న చోట
పరిణామక్రమంలో
చేతి గిరాకీలు చచ్చిపోతున్నా
జీవనానికై పరితపిస్తారే గానీ
జీవిత పోరాటం నుంచి పారిపోరు
ఒక్కోసారి ఏడాది పొడుగునా
దిగులు మేఘం ఆవరించినా
ఏదో ఒకరోజు జీవితం
పాలీష్ చేసిన స్వర్ణంలా
మేరుస్తుందేమోననీ
ఎదురుచూసే ఆశాజీవులు స్వర్ణకారులు

– ఐ.చిదానందం
8801444335

2. కొత్త ఊపిరినివ్వాలి

అపూర్వ నాగరికతకు అందించెను పేరు
నైపుణ్యానికి నిదర్శనమైన కులవృత్తులు
అద్భుత పనితీరును కనబరిచేవారు
కళాత్మక సామాజిక శాస్త్రవేత్తలు
వేగంగా మారింది గొప్పనైన ఆ కాలము
మన సంస్కృతిపై చేసెను మాయాజాలము
స్వలాభమే పరమావధిగా దూసుకొచ్చెను
పెట్టుబడి దర్పంతో దురుసుగా చూసెను
స్వార్థం పెచ్చుమీరిన కొన్ని శక్తులు
నడమంత్రపుసిరితో నక్కజిత్తులు
కనికరం లేని కార్పొరేట్ కత్తులు
కనుమరుగవుతున్నవి కులవృత్తులు
గ్లోబలైజేషన్ కొరడా సర్రని ఝుళిపించాయి
వ్యాపారంలో వాటాలంటూ బురిడీ కొట్టించాయి
నూలు వడికి, సమాజానికి బట్ట నేసిన మార్గము
నేడు నేల చూపులు చూస్తున్నది పద్మాశాలి మగ్గము
రెడీమేడ్ జ్యూయలర్స్ అంటూ దిగారు దళారులు
ఉపాధి కరువై ఉసూరుమంటున్నారు స్వర్ణకారులు
కొడవలి, కొర్రు, వ్యవసాయ పనిముట్లు
అన్నీ ఫ్యాక్టరీల్లోనే తయారయ్యెనే
జీవిక కోసం పడేను ఎన్నో అగచాట్లు
చేసే పనిలేక కమ్మరి, వడ్రంగులు
చాటలు, చీపురు, బుట్టలు కొనేవారు లేరు
వాపోతున్నారు ఆ వృత్తులపై జీవించేవారు
పెరిగిపోయె ప్రయివెట్ ప్లాస్టిక్ కంపెనీలు
మనలను వేసి మూసెను ప్లాస్టిక్ బిన్నులు
పారిశ్రామికరణను మళ్ళీ అధ్యయనము చేయాలి
ఆమోద్యమైన విధానాలు సాధ్యము కావాలి
కులవృత్తుల వారికి కొత్త ఊపిరినివ్వాలి
అందరు సంతోషంతో కిలకిల నవ్వాలి

కుడికాల "సరోజనార్థన్" వంశీధర్
హైదరాబాద్ – 9885201600

3. చావలేక – బతుకలేక

బి సి క వి త

నేననుకున్నాను వెనుకబడిన కులాలు
ముందడుగు వేస్తాయని
నేననుకున్నాను
కులవృత్తులన్ని వెలుగొందుతాయని
కానీ,
వెనుకబడిన కులాల వెనుకడుగాయె
కులవృత్తులన్ని కుంటుబడిపాయే
అగ్రకులాలు అందలమెక్కవట్టె
బి.సి.కులాలు బేజారవ్వవట్టె
చాకలి బండ పాకరవట్టె
కుమ్మరి ఆవం, కమ్మరి కొలిమి ఆరిపాయే
మంగలి బతుకులు, చేనేత మగ్గాలు చెదరాయె
తాపీ మెస్త్రీల తహతలాయె
గీత కార్మికుల తలరాతలు తారుమారాయె
బీడీ కార్మికుల బతుకులు చెల్లాచెదరాయె
వృత్తులన్ని యంత్రాల ఒత్తిడిలో చిత్తడి చిత్తడాయె
ఉన్నవాడు కాక, లేని వాడు కాక
బతుక లేక, చావలేక
నిలువ లేక, నిలదొక్కుకోలేక
నిలువునా కాలవట్టె
బి.సి. కులాలన్ని చావలేక బ్రతుకవట్టె

– వేముల కోటయ్య
తెలుగు పండితులు
అనంతవరం (గ్రామం), బలమూర్ (మం)
నాగర్ కర్నూల్ – 9441455261

4. కులవృత్తులు

సీ. మాసిన గుడ్డల మరకలు దొలగించి
మల్లెలా చాకలి తెల్లజేయు
కుండలెన్నో జేయు కుమ్మరి చక్రాన
పుట్ట వద్దకు నెల్లి మట్టి దెచ్చి
నిప్పు రవ్వలు బడి నిలువెల్లకాలగా
అందాల నగజేయు నవుసులయ్య
మొద్దు మొరడు దెచ్చి ముద్దు బొమ్మలు జేయు
వడ్రంగుల బతుకు వరుగులాయె
తే.గీ. ప్రగతి పథమున నడిపించి పల్లెజనుల
వెల్లివిరిసెను ఒకనాడు పల్లెలందు
దేశమాతయు కీర్తి దిశల చాటి
వెలుగు జిమ్మిన కళలెల్ల తెల్ల బోయె
సీ. పోగుపోగును కూర్చి పోతలు బోసెటి
నేతన్నలెందరో నేలరాలె
సేదతీరక తాను చెమటోడ్చి పండించు
రైతుల బతుకెల్ల చితుకులాయె
పశుపోషణము జేసి పాడిని యందించె
గొల్ల వారింటిలో గోడు లెన్నో
రమ్యంపు శిల్పాలు రాతిసల్పన చెక్కు
శిల్పకారుల బత్కు చితిలమాయె
తే.గీ. అద్భుతంబు జేసి జగతి నాదు కొంటు
ఆర్థికంబుగా జనులకు యండనిలిచి
పల్లె బతుకున నవ్వులు పాదుగొల్పి
చేతి వృత్తుల బతుకులు చేదునయ్యె

– మారుగొండ సాయిలు
ఊరు. నెమ్లి, మండలం. నరుసుల్లాబాద్
జిల్లా. కామారెడ్డి – 9948896953

5. దర్జా పోయిన దర్జీ

ఎలాంటి వారినైనా
తన కళా నైపుణ్యంతో మాయ చేసి
మరింత అందంగా తీర్చిదిద్దే
సనాతన ఫ్యాషన్ డిజైనర్
మౌనంతో మనసులోని
మాలిన్యం తొలగించినట్లు
అనవసరమైన బట్ట ముక్కల్ని
కత్తెరతో కత్తిరించడమే కాదు
అవసరమైన వాటిని
ప్రేమ, ఆప్యాయతల్లా
అరమరికలు లేకుండా
సూది దారంతో కలప గలడు
దసరా పండక్కి గోడగడియారమై
టకటక మిషన్ను పరుగులు పెట్టిస్తడు
అందరిని పండగ
సరదాలో ముంచడానికి
వధూవరులను
రతి – మన్మథుల వలె
తీర్చిదిద్ది పెళ్లి పందిరికి
అసలైన కళను తీసుకొస్తడు

గుడిలో దేవుడి పెళ్లికి పట్టుబట్టలు
పెడుతడు దైవభక్తుడై
బడికి జాతీయ జెండా కుట్టించి
దేశభక్తుడౌతడు
రెడీమేడ్ దెబ్బకి రెక్కలిరిగిన పక్షై
ఎగరలేక విలవిల్లాడుతున్నడు
కొత్తబట్టలు కొనలేక
మిగిలిన బట్టలతో
తన పిల్లలకు కుట్టి
లేటెస్ట్ ఫ్యాషనంటూ తొడిగిస్తడు
ఎందరికో ఆనందాన్నిచ్చిన
తన బతుకే చిందరవందరై
చిరిగిన గాలిపటమై
చింపిరి లాగుకు కుట్టిన
అతుకుల బతుకైంది
దర్జాగా బతికిన దర్జీ
కార్పొ'రేటు' కాలునిలి కాటుకు
కలివికోడిలా కనుమరుగవుతున్నడు

– గంగశ్రీ
(గంగాపురం శ్రీనివాస్)
సెకండరీ గ్రేడ్ టీచర్
సిద్దిపేట – 9676305949

6. బిసి కులం – ఘనచరిత్ర

ఘనచరిత్ర కలిగిన దేశం
వ్యవసాయాధారిత భారతదేశం
దేశంలో అనేక కులాలు కలిగిన వైనం
అందులో బి.సి.లదే అగ్ర తాంబూలం
అన్ని వృత్తులలో బి.సి.లదే ఎక్కువ శాతం
దేశాభివృద్ధిలో ఘనమైన నిర్మాణం
ఉనికి కోల్పోతున్న బి.సి.కులాల నైపుణ్యం
దీనంతటికీ కారణం కార్పొరేట్ రంగం
అందమైన భవనాలు నిర్మించిన సగర(ఉప్పర) కులం
నేడు తాము ఉండడానికి ఆవాసం మాత్రం శూన్యం
కట్టుకోవడానికి బట్టలు నేచిన నేత కులం
నేడు షాపింగ్ మాల్‌ల వల్ల మరుగున పడ్డ మగ్గం
వ్యవసాయ పనిముట్లు అందించిన వడ్రంగి కులం
నేడు యంత్రాల మోజులో కోల్పోతున్న ఆధారం
అందమైన ఆభరణాలను మలచిన స్వర్ణకులం
నేడు నగల షాపులలో కూలీలైన దౌర్భాగ్యం
ప్రజలకు చెట్టు కల్లును అందించిన గౌడ కులం
నేడు బీరు, బ్రాందీల మోజులో మరచిన జనం
పల్లెప్రజల బట్టలుతికిన చాకలి కులం
నేడు వాషింగ్ మిషన్ల రూపంలో మునిగిన రూపం
మట్టిపాత్రలనందించిన కుమ్మరికులం
నేడు రైస్ కుక్కర్‌లా ఉడుకుతున్న జీవితం
అక్కడక్కడా ఎదుగుతున్న బి.సి.బిడ్డలం
అయినా అవకాశం దొరకని రాజకీయ రంగం

– వేముల తిరుపతయ్య
నాగర్ కర్నూలు – 9441090722

బి సి క వి త

7. చేయూత కరువైన చేనేత

పత్తి దారమై రాట్నంలో
కండై మగ్గంపై పడుగై
దేహానికి వలువై మురిసింది చేనేత
సౌందర్యాన్ని నిలుపని వలువ లేదు
ఇరువది నాలుగు గంటలు
మనిషి మేనుపై నిలిచేది
టక టక నాడే శబ్దాలే
వేకువజాము కోడికూత అయ్యేది
మగ్గం శబ్దం రాగాలే
కళ్యాణ రాగ గీతాలయ్యేవి
నేసినదంత కండెల
చిప్పను పూడ్చి పెట్టింది
అతుకు పెడితేనే మెతుకు పడేది
పడుగుకు పెట్టిన గంజి నీళ్లే
వారు కడుపు నింపుకునేది
ఆకలి తీరుతుందా అని
ఎవరైనా అడిగినా
దోనెకు చుట్టిన బట్టకే
పొట్ట ఆన్చే వాడు
తన బిడ్డలు తనలా
లాకలా మారరాదాని
బడిబాట బతుకుకు
ఆధారం అవుతుందని
అక్షరశాలకు పంపిన కన్న వారి
ఆశలు అడియాశలాయే
కాలం గుప్పిట్లో నూలు ధారలు
ధరణిని మించిపోయే
వలువల విలువలు తరిగిపోయే
పాలిస్టర్, శిల్క్ పరిశ్రమల
ధాటికి దహనమయ్యే
చేనేత వాడల్లో
సాంచాల నడక ఆగినై
నేసి నేసి వెన్నపూసవిరిగి
సిరల్లో సిరంజి ఎక్కే
పడుగుకు గంజి లేక
పిడచకట్టే గొంతు
ఆసులా మెలికలు తిరిగే పేగులు
అప్పుల ఊబిలో మునిగే జీవితాలకు
సరితాడు ఉరితాడులా అంకితమైంది
పింజరి మీది పేటు
రక్త పింజరై కాటువేసే
మగ్గం గుంటే ఆ దేహానికి
గుంతై నిలిచే
కన్నబిడ్డలు వీధులపాలాయె
నేతన్న బతుకులు నేల పాలాయె
దు:ఖిస్తున్న చేనేతకు కొండంత
అండై చేనేత హక్కులను,
సహకార సంఘాలను పునరుద్ధరించి
వారి జీవనభృతికై పాలకులు
ప్రతి చేనేత లోగిళ్ళలో
ఉపాధి లక్ష్యంకై బాటలు వేయాలి
అప్పుడే ! చేనేత వాడల జీవితాలు
కళ కళ లాడతాయి

– తుమ్మా రాజా
కోదాడ – 8099918883

8. పసలేని బతుకులు

సిరిసిల్ల సాంచాలు
సిరిదెచ్చు కంచాలు
నేతన్నల జీవితాలు
ఉరిగట్టే మొగురాలు
వారెవ్వా సాంచ!
నడవకున్న పొట్ట కురచ!

పడుగూ పేకల మిళితం
అందమైన వస్త్రము
అరుగు వాకిలి బతుకులు
నేతన్నల జీతము
వారెవ్వా నేతన్నా
నీనేతే ఘనతన్నా

చాకలి కొమురన్నా
చాకిరేవు యేది
రోకలి మిషనొచ్చి
రాకి రాకి విసురుతుంది
యిపుడు చాకిరేవు బండ
కొమురన్నకు గుదిబండ

కాట్నాలు మారేను
పట్నాలు చేరినాయె
కాటి కాపరి బతుకు
కన్నీరు మున్నీరయె
విద్యుత్తు కాట్నాలు
విస్తరించె పట్నాలు

బుడబుక్కల వారు
బుక్కతో రారేరి?
మాడు చెక్కలేకదా
మనిషి కడుపు నింపు మరి?
జానెడు కడుపు నింద
జారలేదురా ముద్ద

హరిదాసుల వారు
మిన్నంటు రోదన దారి
గంగి రెద్దుల వారు
గర్జించ రారేరి?
వీథులన్నీ నేడు
వివస్త్రయ్యేను చూడు?

గాండ్లోళ్ల పెద్దమ్మ
గానుగ నూనేది?
గిర్నీలోన నూనెదిని
పీనుగ బతుకయ్యోయిది
సహజ నూనెలు బాయే
సంపుచుండె కాయే

గౌండ్లోళ్ల లచ్చున్న
పొద్దదు కల్లదియే
అంబటి యాల్లాయే
కల్లు బింకి రాదాయే
బింకి చిల్లు బడెను
బొక్క బోర్లా బడెను

కమ్మరి కొలిమిని
ఊదేసే పెత్తిబరులు
కుమ్మరి చక్రమును
కూలదోసె ప్లాస్టిక్కులు
వారెవ్వా కులవృత్తులు
కరుగుచున్న కొవ్వొత్తులు

గీతన్న కుండా పగిలె
థమునప్పులు దండిగాయె
నేతన్న చీర చిరిగె
పాలిస్టర్ పైచ్చుమాయె
వారెవ్వా కులవృత్తులు
కాలుతున్న వత్తులు

చిందు భాగోతములో
చిత్రమైన కథలూ
చిందోళ్ళ జీవితాలు
ఛిద్రమైన వ్యథలూ
వారెవ్వా చిందూ
నీ ఆటలిపుడు బందు

భీవండి కెళ్ళినావు
సాంచలెన్నొ నడిపినావు
భీమారితొ తిరిగొచ్చి
బతుక భారమయ్యావు
వారెవ్వా నేతన్న
నీరాత మారదన్న

వింత వింత బతుకులు
ఛిద్రమైన కులవృత్తులు
వలస జీవిత గాథలు
వెలివేసిన జీవితాలు
వారెవ్వా వలసలు
బతుకు కొరకు పదనిసలు

సర్కస్ ఫీట్లేవి
బుడ్డర్ కాను జోకేది
సాధనా శూరులేరి
సాధనాల జాడేది
వారెవ్వా వృత్తులు
వలసలకు బత్తులు

తల్లడిల్లు చుండె
తర తరాల వృత్తులు
పద పద పట్నమంటూ
పతన మయ్యె పల్లెలు
వలస జీవితాలు
పసలేని బతుకులు

మంచికట్ల శ్రీనివాస్
గోపాలపురం, హన్మకొండ
వరంగల్ అర్బన్ జిల్లా –
9701752618

9. మురికి

వదిల్చాలి... విదిల్చాలి
బట్టకు పట్టిన మురికిని
బతుక్కు పట్టిన మురికిని
ఆచ్ఛాదనంతా దుమ్మూ ధూళి
మలినాలు కప్పుకున్న దుప్పట్లనీ
బండమీద చరుచుకున్న చప్పట్లనీ
మతులతో మైలపడ్డ చూపుళ్లనీ
చాకిరేవు దగ్గర జాడించాలి
ఆ దిశగానే నడుస్తున్నా
ఈ దశమారదా అని ఏడుస్తున్నా
పనికిరాని ప్రవృత్తుల్ని పక్కనబెట్టి
వృత్తి బరువును భుజానకెత్తుకున్నా
ఉడుకుతున్న ఉడుకునెత్తురు సాక్షిగా
ఉడకబెట్టాలి గరమైన గంగాళంలో
మెలిపెట్టి తిప్పిన బట్టల్ని ముడిపెట్టాలి
ఇంటి ఆనవాళ్లను గుర్తుపెట్టాలి
రెక్కల్ని యంత్రపు ముక్కల్లా
గిరికీలు కొట్టిస్తూ.. గిర్రున తిప్పేస్తూ..
బట్టల్ని బండకేసి చరచాలి
మొఖమంతా రక్తపు బొట్టయ్యేట్టు
పిసికి.. పిండి ఎండేయ్యాలి
ఏ చెట్టుపైనో
మట్టంటకుండా ఆరెయ్యాలి
గడప గడపనూ తట్టాలి ఆకలి
కడుపునూ కుట్టుకోవాలి
మురికి బట్టల్ని మూటేసుకుంటూ
పనిలో పాటల్ని
పోగేసుకుంటూ
బతుకు దెరువుల
దారివవ్వాలి
నష్టాల అతుకుల్లోనూ
బతుకు జరిగేది
కష్టాల ఉతుకుల్లోనూ
మెతుకు దొరికేది
మార్కెట్ మాయా
ముసుగేసుకొచ్చింది
వాషింగ్ మిషన్లు
కోరలనోళ్లు తెరిచాయి
ఆసాంతం వృత్తినే
కరకర నమిలేసాయి
ఇప్పుడు వ్యవస్థే
మురికై పోయింది..!

– కటుకోర్ఝ్వల రమేష్
9949083327

10. కులవృత్తులేమాయె ?

నేటి సమాజము భువిపై ఎంతో మారిపోయె
ఈ జీవితమంతా యంత్రాలమయమాయె
కులవృత్తులన్ని దారిలేక మాయమాయె
కూటికోసం ఆగని వలసల బ్రతుకులాయె !

చేతిమగ్గాల జాడ చేయి విడిచి జారిపోయె
శాలోల్ల విధిరాతలు చేయూతలేక చెదరిపోయె
నేతన్నలకు కండెపోగులే ఉరితాడులాయె
నూలు బట్టలన్ని తెల్లబడి స్మశానానికేగిపోయె !

కుమ్మరోల్ల కుండలన్ని మన్నులోనె నిక్షిప్తమాయె
మట్టి ప్రమిదల వెలుగు దీపాలన్ని ఆరిపోయె
నేలమట్టి కలత జెంది బురదగా మారిపోయె
మట్టి సువాసనలకు మనుషులంత దూరమాయె !

వడ్లోల్ల చెక్కబొమ్మలు కలపలోనె ఉండిపోయె
పెద్ద బాడిసల పోటు చప్పుడు మూగబోయె
కొయ్య నాగలి సృజనజ్ఞానం అంతరించిపోయె
పట్టెమంచము పీటబల్లలు ఇల్లు విడిచి వెళ్లిపోయె !

కమ్మరోల్ల నాగలి ఇనుప కర్రులు వీడిపోయె
కొడవలి పార గునపం గొడ్డలి మొండిదాయె
కంచెరోల్ల కంచు ఇత్తడి గిన్నెలన్ని పాతగాయె
ఉగ్గగిన్నె కొప్పెర గంగాళములు వింతలాయె !

ఆదరణ లేక కుల వృత్తులన్ని అంతమాయె
ఆచరణలేని వృత్తులెన్నో జీవిత భాగమాయె
యువత అంతా ఊరు విడిచి ఉద్యోగులాయె
పల్లెటూరులు వెలుగులేని చీకటి గూడులాయె !

ఈరబత్తిని రవి (ఈవి)
భివండీ, మహారాష్ట్ర
8080336648 / 9423945594

11. వృత్తిదారులం

వెనుకబడ్డ జాతులం కాదు
వెనుకకు నెట్టి వేయబడ్డ జాతులం
వ్యవస్థ నిర్మాణానికి పునాది రాళ్లయ్యాం
సంప్రదాయ వృత్తులతో సమాజాన్ని నిర్మించాం
సాంకేతిక ఆవిష్కరణల హంగులతో వ్యవస్థ విహరిస్తుంటే
ప్రపంచీకరణ అస్త్రాలతో పేర్చిన అంపశయ్యపై
మా జాతి శయనిస్తోంది
నిన్న దాహార్తిని తీర్చిన మట్టి కుండ
నేడు మట్టిలో కలిసిపోయింది
కడుపు నింపిన కంచరి కంచం కనుమరుగయ్యింది
రైతుకు ఊతకర్రలాంటి నాగలి మూలన పడ్డది
ముగ్గు పోసి మూలవాసం పెట్టే వరకూ
నీవెంట ఉన్న వడ్రంగితో నేడు పని ఏమున్నది
పుస్తెమట్టెలతో బంధాల్ని కలిపిన కంసాలికి
బాసట కరువయ్యింది
చలువ పందిళ్ల మేదరికి నేడు నీడ కరువయ్యింది
రాల్లు కొట్టే వడ్డెరన్న కాంక్రీట్ కింద నలిగి పోతున్నడు
నేతన్న మగ్గం మరణశయ్యగా మారింది
మంగలి కత్తి – చాకలి రేవు
చావులకు మాత్రమే పరిమితమయ్యాయి
వృత్తిదారులం నేడు
ఓటు దారులుగానే మిగిలి పోయినం
రాజకీయ నాయకుల చేతిలో మేము మైనపు ముద్దలమయినం
మాకు ఒక రూపం ఇస్తరని ఎదురు చూస్తుంటం
కానీ, వారికి ఎలా కావాలో అలానే మలుచుకుంటరు
మేము వెనుకబడిన జాతులం కాదు
వెనుకకు నెట్టివేయబడ్డ జాతులం !

– అయిలా సోమనర్సింహాచారి
పెంబర్తి, జనగామ జిల్లా – 98484 80442

12. వెనుకబడిన వృత్తులు

కురుమ కమ్మరి సాలే మంగలి
కనుమరుగౌతున్న కులవృత్తులు
కరువైపోతున్న సంప్రదాయాలు
మేదరి, వడ్రంగి, కంసాలి
మోచి, బెస్త, గానుగా, చాకలి
బుక, నీరడి, కుమ్మరి పేరేదైతేనేం
కనికరించని పరిస్థితులకు తలవొగ్గిన కష్టజీవులు
ఒకప్పుడు ఇంటికో చాకలి
వీధికో వడ్రంగి ఉరికో మోచి
ఇప్పుడు కాగడ పట్టి వెతికిన
కానరాని సంస్కృతి
శుభమైన అశుభమైనా కార్యానికి ముందుండి
నడిపించేవి కులవృత్తులే
ఒకప్పుడు నిత్య జీవితంలో
మమేకమై నేడు మరుగున పడ్డ గురుతులై
నిన్నటి వైభవాన్ని తలుచుకొని
రేపటి భవిష్యతును వెతుక్కుంటూ
కునారిల్లుతున్న కులవృత్తులు
పట్టెడన్నం పెట్టని కులవృత్తులను నమ్ముకుని
చేతినిండా పనిలేక అడ్డకూలీలుగా మారుతున్న
వృత్తిదారులు
ఆదుకునే చేతులకోసం
దీనంగా ఎదురు చూపులు.....!

– టి.వసంతాలక్ష్మణ్
నిజామాబాద్ – 7013006795

13. మనుగడ ఎలా?

నాలుగు పదుల కాలాలు
వెనుకకు నడచి నెమరు వేసుకుంటే
నాగరికత.. కులాలను కులవృత్తులను ఎంతగా
నమిలి మింగేసిందో తెలుస్తది
నాటి జనజీవన విధానంలోకి
ఒక్కసారి తొంగి చూసి పరిశీలిస్తే
నేత గీత కుమ్మరి కమ్మరి
చాకలి మంగలి వడ్రంగి అవుసలి కంచరి మేరె
బెస్త బంటు కులాలవారు ఒకరికి ఒకరే కాకుండా
ఇతర కులాల జీవనానికి అవసరం ఆధారంగా
ఇచ్చి పుచ్చుకునే ధోరణితో జీవించేవారు
ఫలాన వారికి ఫలాన వారే చేయాలన్న
కట్టుబాట్లు పద్ధతులతో మనుగడ సాగించేవారు
నేడు అన్ని కులవృత్తులు
సకల కులాలవారు చేస్తున్న
ప్రస్తుత సమాజంలో కులాభిమానం కరువు
కులవృత్తులపై గౌరవం పోయి
వృత్తులు చేసేవారికి కనీస ఆదాయం రాక
వేరే పనులలో స్థిరపడుతున్న తరుణంలో
కులవృత్తుల ప్రధాన్యతలు కనుమరుగై పోతున్నాయి
చివరికి వృత్తి పని చేసేవారికి
పిల్లనివ్వాలన్న ఆలోచనను
మనసులోకి రానివ్వకుండా ఉన్న
నేటి ప్రస్తుత సమాజంలో
కులవృత్తుల ఎలా మనగలుగుతాయి?

– జయాకర్ రాపోలు

నల్లగొండ – 9963581382

14. వడ్రంగి బతుకులు

ఏం బతుకులైనయ్
మా వడ్రంగి బతుకులు
గతవైభవం కనుమరుగాయే
గరీబులుగా బతుకుడాయే
ఉపాధి కోసం పడిగాపులాయే
బతుకు దెరువుకు వెతుకులాటాయే
పల్లె వదలి పట్నంబోతే
ఇంటి అద్దెలు కరెంటు బిల్లులు
కట్టలేక కష్టమాయే
పొద్దున్నుంచీ పొద్దూకులు
చెమటోడ్చి శ్రమపడినా
చాలీచాలని సంపాదనాయే
ఇంటిల్లిపాదీ హరిగోసలాయే
రెక్కాడితే గాని డొక్కాడదాయే
మాలో వేలమంది పేదలున్నరు
సొంతిల్లు లేని పనిమంతులున్నరు
కూటికి ఎల్లని దరిద్రులున్నరు
పనితనమున్నా పస్తులాయే
పనిముట్లు కొనే సొత్తు లేదాయే
సర్కారు సాయం లేకపాయే
ఆదుకునే నాథుడే లేకపాయే
మా వృత్తికి ప్రోత్సాహం ఇవ్వరాయే
మా బతుకులిలా మొండిమానులాయే

- వంగాల సైదాచారి
గేయ రచయిత - 9010757133

బి
సి
క
వి
త

15. కొలిమి

వృత్తిని నమ్ముకొని బతికినోల్లం
ఉన్నదమ్ముకున్నా బతికేటట్టు లేదు
ఎందరిండ్లళ్ళనో కళ్యాణగంటలు
మోగించిన మా పనిముట్లు
ఇయ్యాల మా ఇంట్లో గోడలకు అలంకారాలైనయి
వచ్చి పోయేటోళ్లతోని కళకళలాడే వాకిలి
బోసిపోయి దో అన్నట్లుంది
పొద్దుగాల పూజ చేస్కొని
పది మందికి మంచిచెడు చెప్పేటోళ్లు
తెల్లారక ముందే కంపెనీ బస్సు
కోసం సడాక్‌ల నిలబడుతుంట్రు
కార్పొరేట్ కాలు మోపింది
ఇత్తడి సామాను అటకెక్కింది
మాయింట్లకవసరమైనవి కూడా
బజార్ల కొనాల్సిన అగత్యమొచ్చింది
ప్లాస్టిక్ సామాను కొత్త కోడలై నట్టింట్ల నాట్యం చేస్తుంది
ఇంకెక్కడి కులవృత్తులు
ప్రపంచీకరణ మోజులో కొలిమిలో బూడిదోలె
దుమ్ములో కొట్టుక పోయినయి
తాత తండ్రుల దగ్గర ప్రేమగ నేర్వాల్సిన వృత్తివిద్యలను
పాలిటెక్నిక్ కాలేజీల్లో పుస్తకాలు చదివి నేరుస్తున్నరు
ఇంటికాడ రాజా లెక్క బతికెటోడు
కంపెనీల కూలీగా బతుకీడుస్తుండు

– దార్ల రాఘవేంద్రాచారి
జడ్చర్ల, మహబూబ్ నగర్ జిల్లా – 9492991636

బి
సి
క
వి
త

16. చా(ఆ)కలి

భూమి భారాన్నంతా తానే మోస్తున్నట్లు
నెత్తిమీన చాకలి మూట
భారమైన మూటనిండా
ఊరి జనపు మాలిన్యం
ఆమె కోపంతో ఒక్కొక్కరినీ
ఉతికారేయగలదు కాకుంటే బట్టలరూపంలో
ఆమె కన్నీళ్లు చాకిరేవు నీటిలో కలిసిపోయాయి
ఉప్పునీళ్లకు బట్టలెలా తెల్లబడతాయి మరి?
ఆమె ఎండిన గుండెలు ధనస్సులా వంగిన నడుము
తరతరాల దౌర్భాగ్యానికి అభినవ ప్రతీకలు
జనపనారను పోలిన ఆమె జుట్టు
ఆమె కాలివేళ్ల పుండుపడిన చర్మం
ఆమె ఆనారోగ్యానికి సూచికలు
ఐదు వేళ్లు నోట్లోకి పోవాలంటే
పదిండ్లయినా ఉతకాల్సిందే
దొడ్డుబియ్యపు అన్నంలో కలిపిన ఎల్లిపాయకారం
కారుతున్న కన్నీటి భావాన్ని మార్చినట్లుంది
ఆమె ఎదురుగుండా
తన చిన్నబిడ్డ ఎండిన బట్టలకంటిన
పల్లేరుగాయల్ని తీస్తూ ఆకలి నవ్వొకటి నవ్వింది
ఉరేసుకు చచ్చిన భర్త
రూపమేదో బిడ్డచెక్కిలిపై కనిపించింది
గబుక్కున బిడ్డను దగ్గరికి అలుముకుని
ఎండిన రొమ్మును నోట్లోకి దూర్చింది.

– రాజేశ్వరరావు
అంకతివాడ, లక్షెట్టిపేట, మంచిర్యాల – 9441873602

17. కులవృత్తి

ఆశల్ని చేతి వాటం అంచున
ఆరాటాన్ని ముని పంటి పంచన
పనిని నమ్ముకుంటూ
శ్రమను అమ్ముకుంటూ
కులవృత్తిని వదలక
ఎదదను పంచే వృత్తి
మనసంతా చిత్తవృత్తి
తనువంతా ఆత్మసంతృప్తి
ఉలిపోటుతో శిలను శిల్పంలా మార్చి
కత్తి వేటుతో చర్మాన్ని చెప్పులుగా అమర్చి
కొలిమిలో కుండలా బ్రతుకు ఆవిరయ్యింది
కూలివాడి గుండెలా కుమిలింది
మండుటెండలా ఎండినా
పండుటాకులా జారినా
బురద బాటలో పారినా
అలుపెరుగని శ్రామికునిలా
ఊపిరితో కష్టాన్ని కొలిచి
నిట్టూర్పును కాలంలో దాచి
సమస్యల వలయాలు ఛేదించుకొని
వ్యయ ప్రయాసాలు తొలగించుకొని
చాలీ చాలని పైసలు
కడుపు నిండని పస్తులు
సుదూర తీరం వరకు గమ్యం
దిక్సూచి లేని నావ పయనం

– సముద్రాల శ్రీదేవి
హైద్రాబాద్ – 9949837743

బి సి క వి త

18. ప్రాణం పోద్దాం మళ్ళీ

అచ్చమైన పల్లె పచ్చదనంలో
తొలిపొద్దు కొడికూతలు కోయిలమ్మ తేనెపాటలూ
అలుపూ సొలుపూలెరగక సాగేటి సెలయేటి ఉరుకుల పరుగులన్నీ
చినబోయి చూస్తున్నవి నేడు
కులవృత్తుల సవ్వడి కానరాక నగరమోజుతో నడిబజారున నిలిచి
మట్టికడిగిన వట్టి చేతులతో కుమ్మరి బాడిసెనొదిలిన వడ్రంగి
గంపలల్లే మేదరి గరీబులుగానే మారే
చాకిరేవులేక చెరువు లింకిపాయే
గీతలేక తాటిలన్నీ కాలిపోయే
చిరుగాలికే చిం(ద్రమయ్యే బతుకుల్లా చిగురాకుల్లా మారిపోయే
రైతులింట అడుగంటిన ధాన్యపురాశులై
గుమ్మాలకు కట్టే వరిగొలుసుల్లేక
ఉరపిచ్చుకలన్నీ ఊరవతలికి పాయే
గొర్లుగాయని గొల్లలు గాలమేయ్యని జాలర్లు
సదుగులిరిగిన శాలలు కుట్లు తెగిన మేరలు
పల్లె మట్టి పరిమళానికి దూరమై తనువునున్న గాయపు మనసుతో
తీరని ఆకలికై తీరాలు దాటవట్టే మూడుతంతెల వారసంపదేదనీ
తల్లడిల్లుతోందీ పల్లెతల్లి తనువంతా చిక్కిన అవ్వలా
కదులుదాము రండీ కలగలిసిన పల్లెతనపు
కమ్మని పిలుపులకై సింగిడి రంగులనలుముకున్న
సిరిసంపదలకై పల్లెబాట పడదామూ
పల్లె కన్నీరు తూడుద్దామూ పచ్చల హారమునలంకరించి
స్వచ్ఛమైన పల్లె స్పర్శ కులవృత్తులేనని ప్రాణం పోద్దాం మళ్ళీ

– గోస్కుల శ్రీలత రమేశ్
హుజురాబాద్, కరీంనగర్.
7013943368

19. జాలరి బతుకుపోరు

జాలరి దిన పోరాటము
జీవికకే ఆరాటము
సాగర గర్భంలోనే
ప్రాణంతో చెలగాటము
పడవ, వలలును సవరించి
ఆహారము సేకరించి
వనితనెదురు రమ్మంటూ
పిల్లలనూ పలకరించి
వేటకెళ్ళు ప్రతిసారి
ఋణం తీరును కడసారి
చివరి చూపు ఇదేననీ
బహుదూరపు బాటసారి
ఇల్లాలుకు ఎదురు చూపు
బిడ్డలలో బెదురు చూపు
అనుకోనిది జరిగినపుడు
సింధూరమె చెరిగి చూపు
కడలి తల్లి నమ్మినారు
కష్టములే తలచినారు
బిడ్డలనే చదివించియు
బతుకు గెలుపు పొందినారు

- ఎం.వి. ఉమాదేవి
ఇందుకూరుపేట - 7842368534

బి సి క వి త

20. కులవృత్తులు - ప్రాముఖ్యత

కుమ్మరికుండా
కమ్మరికొలిమీ
నేతన్న వస్త్ర నేత
ఈ భూమి మీదనే కదా
వడ్రంగి పనిముట్లు
గీతన్న కల్లుగీత
సాకలి చాకిరేవూ
మంగలి క్షౌరవృత్తి
అన్నిను మరుగాయే
కలం హలం తమదారిపట్టాయి
పాడైన బతుకుల పరిశుభ్రత కోసం
అంతా ఈ జగతియే కదా
ప్రకృతినైపుణ్యం మట్టిబొమ్మలు
ఆకర్షణీయమైన అనుభూతి
విహారయాత్రలు పార్క్‌ల్లో
అందం ఐశ్వర్యం కళానైపుణ్యం
ముఖచిత్రం సఖ్యత
అన్ని ఈ లోకంలో కనుమరుగాయే
కష్టసుఖాల కలబోత
మంచి చెడుల ప్రాధాన్యత
ప్రకృతి అందాలు చెక్కే శిల్పకళ
కళారూపం
ఎంతో కనువిందాయే నాడూ
అన్ని కనుమరుగయేను చూడుబనేడూ

- మహేందర్ జవ్వాజి
కలంపేరు "షాపూరం"
యాదాద్రి భువనగిరి - 8978503203

బి సి క వి త

21. దర్జాలేని దర్జీ

సూదిమొనపై జీవితం అతడిది
బట్టపై సూదిమొనతో నాట్యంచేయిస్తూ
మనిషికి వస్త్రంతో అందాన్ని ఆపాదిస్తాడు
నాగరీకుడిలా మలుస్తాడు
బాధ్యతల సూదిమొన గుచ్చుకుని
జీవితం విలవిల్లాడుతున్నా
జీవిత చరమాంకంలో బీదరకం బాధిస్తున్నా
కష్టాలు వేధిస్తున్నా మిషన్‌పై అతడి కాళ్ళు వడివడిగా
ఒలింపిక్స్ పరుగుపందాన్ని తలపిస్తాయి
జీవిత పరుగుపందెంలో నిత్యం ఓడిపోతున్నా కూడా
అతుకేసిన బ్రతుకు తెల్లారిపోతున్నా
మనిషిని నాగరీకుణ్ణి చెయ్యడానికి
అతని చేతివేళ్ళు నిత్యం శ్రమిస్తూ ఉంటాయి
మనిషికి ఓ అందమైన ఆకారాన్ని నిర్మిస్తాయి
ఒడుదొడుకుల జీవితంలో అతని కాళ్ళు నిత్యం
మిషన్ తొక్కుతూనే ఉంటాయి
రెడీమేడ్ భూతం అతని జీవితాన్ని తొక్కేస్తున్నా
పేదరికం సూదిమొనలా అతని జీవితాన్ని గుచ్చేస్తున్నా
వణికే చేతుల్తో సూదిలో దారం ఒడుపుగా పెట్టేస్తుంటాడు
నిన్నూ నన్నూ నాగరీకుడిలా నిలబెట్టడానికి
జీవితంలో అతనెప్పుడూ ఓడిపోతుంటాడు
అందమైన బట్టలతో విజయచిహ్నం చూపించే
మనముందు అతడెప్పుడూ పరాజితుడే
మనల్ని ప్రతిసారీ గెలిపిస్తూ ..!

– మాడిశెట్టి శ్రీనివాస్
ధర్మపు, జగిత్యాల జిల్లా - 7382848468

బి
సి
క
వి
త

22. పల్లెలన్నీ బోసి పోయె

వ్యవసాయ క్షేత్రంలో
బి.సి కులవృత్తుల పాత్ర
ఎంతో ప్రాధాన్యతతో
కలబోసుకున్న బంధం
కూటికి ఉంటే చాలు
కోట్లకున్నంత సంతోషము
హలం కట్టుటకు ఎడ్లు లేక
యంత్రాల సాయంతో
సాగుచేసే రోజులు
దొడ్డిలో పశువులు లేక
రసాయనిక ఎరువులు
నాగటి కర్రుకు మొన పెట్టు
కమ్మరి కొలిమి ఏది
తాగు నీరు నింపు కుండలేవి
ధాన్యం బస్తాలు మోసే బండ్లు ఏవి
తాళ్లను అల్లే తాతలు ఎక్కడ
తట్ట బుట్టలను అల్లే ఎరకలి వారేరి
యంత్రాల వ్యవసాయంతో
చేసే పనితో జీవనోపాధి లేక
బి.సి కులవృత్తులంత
పట్టిరి వలస బాట
తల్లిలాంటి పల్లెలన్నీ
బోసిపోయి తల్లడిల్లు చుండెను
ఎక్కడ మీరంతా ఎక్కడా
ఓ.బి.సి కులవృత్తుల్లారా
పల్లె తల్లిని మురిపించగ
వస్తారు కదు మళ్ళీ..!

– ఎడ్ల లక్ష్మి
సిద్దిపేట – 8466850674

23. కులవృత్తులు

(నానీలు)

కులవృత్తిని వదలి
కూలీలుగా కుస్తీ
నగరీకరణతో
పల్లె దోస్తీ

కులవృత్తులకు
సవతి పోరు
యాంత్రికత
నేడు పట్టపు రాణి

వాషింగ్ మెషీన్
ఐరన్ లెగ్ పెట్టే
చాకలి పొయ్యి
చప్పున చల్లారే

కనుమరుగవుతున్న
కుమ్మరి చక్రం
ప్లాస్టిక్ దెబ్బకు
పారా హుషార్

అద్దాల పార్లర్‌ల
ఆగడాలు
కుత్తుక తెగిన
మంగలి కత్తి

కమ్మరి కొలిమి
కాటువడ్డది
యంత్రాల జాతర
షురువైంది

నేసిన చీరే
ఉరి అయింది
నేతన్న తలరాత
తిరగలబడింది

– ఓరువాల సరిత
(కలం: సరితనరేష్)
ప్రభుత్వ ఉపాధ్యాయిని
నల్గొండ జిల్లా –9966393456

24. కాలమే జవాబు చెప్పాలి

కవిత రాద్దామని కలాన్ని కదిలిస్తే
వేణు గానపు సవ్వడేదో మదిని తాకింది
పరవశంతో కలియ చూశాను
అది మన వడ్రంగి ప్రాణం పోసిన
వేణువు పలికిన సంగీత ఝరి అనుకున్నాను
తడారిన గొంతుకలకు
కుమ్మరి కుండ అందించిన చల్లని అమృత బిందువుల
గుటకల సవ్వడి అనుకున్నాను
అగ్గిపెట్టెలో పట్టే ఆరు గజాల చీరను నేసిన
నేతన్న మగ్గం గుండె చప్పుడు అనుకున్నాను
అది మన స్వర్ణ కారుని చక్కని చేతివేళ్ళు సృష్టించిన
ఆభరణాల అలికిడి అనుకున్నాను
అది కమ్మరి కొలిమి ఊపిరందించిన
పనిముట్ల పదనిసలేమో అనుకున్నాను
చాకలి రేవు దగ్గర రజకుడు మోదిన
మురికి బట్టల మోత అనుకున్నాను
మిషను చక్రాన్ని నమ్ముకొని
బతుకు చక్రాన్ని ఈదుతున్న
దర్జన్న బట్టల కోలాహలం అనుకున్నాను
గొర్రెలను కాస్తూ చెట్టు నీడన
పచ్చని పచ్చికను పట్టు పాన్పు వలె తలుస్తూ
తనను తాను మైమరచి నప్పుడు
చల్లని గాలికి ఊగిసలాడిన గొంగడి గల గల అనుకున్నాను
అక్కర్లేని కురులను కత్తిరించే
మంగలన్న కత్తెర కలకలం అనుకున్నాను
కానీ అది ఈ ధ్వనులన్నింటినీ ఏకం చేసిన

బీసీ ఐక్యతా నాదామని గ్రహించి
నా మది ఆనంద సంద్రంలో ఉవ్వెత్తున ఎగసిపడిన
అలల అగ్రభాగాన నర్తించింది
అంతలోనే దిగులు మబ్బు కడగండ్ల
ముసుర్లను ఎన్నింటినో మోసుకొచ్చింది
నవ నాగరిక సమాజాన
బలీయమైన యంత్ర నాగరికత ఇరుసులో
పడి నలిగిన వడ్రంగి రంపము
నడుము విరిగిన నేతన్న మగ్గం దగ్ధమైన కంసాలి కుంపటి
చిల్లులు పడ్డ కుమ్మరి కుండ చెదలు పట్టిన చాకలి బండ
కళ తప్పిన కమ్మరి కొలిమి
ఆధునికత ముసుగులో బీసీల కుల వృత్తులన్నీ
యంత్ర బలిమి ఎత్తుకుపోతే
ఉపాధి కరువైన బీసీలు ఊసురు మంటున్నారు
జనంలో సగం అయినా
జగతిలో తమకు దక్కిన స్థానం ఎంతని
జగమంతా కష్టాల దండోరా వేసినా
పట్టించుకునే నాథుడు లేక
పల్లేరు కాయలు ఎన్నింటినో పంటి బిగువున బిగిస్తూ
బతుకును బలిపీఠంపై పెట్టి పొట్టకూటి కోసం పొద్దుకో తీరుగా
పని దేవతతో పోట్లాడుతున్నారు
బీసీల బతుకులు బాగుపడే దెన్నడో
సమసమాజ ధ్యేయం నెరవేరేదెన్నడో
కాటేసిన కాలమే జవాబు చెప్పాలి

– ఉప్పల పద్మ
మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా – 8340933254

25. బీసీ డిక్లరేషన్

ఈ నా ప్రజాస్వామ్య దేశంలో
అంతా సర్వ స్వతంత్రులే
రాజ్యాంగం ముందు సర్వసమానులే
స్వేచ్ఛా విహంగాలై జీవించే
హక్కు కలిగిన మనుషులే
వినడానికివన్నీ నేతిబీర చందాలే
స్వాతంత్ర్యం ఇచ్చిన స్వతంత్రంతో
కుతంత్రంగా చాటుమాటుగా
వాడు మా జీవితాల్లోకి వోరగా
తొంగి చూస్తాడు
కులవృత్తులు చేసుకుంటూ
జీవనం సాగించే మా బతుకులకు
ఎసరు పెడతాడు
కుమ్మరి కుండకు చిల్లు పెట్టి
కమ్మరి కొలిమికి జెల్లకొట్టి
నేదర బతుకుకి మేదరగొట్టి
చేనేతకొయ్యకు వురికొయ్యకట్టి
దుక్కుటెడ్లకు ద్రోహంచేసి
నా నాగలికర్రుని వెట్టిదాన్నిచేసి
జీవితాలతో కర్రాబిళ్లా ఆడతాడు
మా రిజర్వేషన్లపై అసూయతో రివ్వున ఎగిరి
పూలే అంబేద్కర్ల ఆశయాలను
తుంగలో తొక్కి నిప్పు రాజేస్తాడు
నిరంతరం కాపలాకుక్కలా కాచి
అవి మాకు దక్కకుండా చేస్తాడు
మా భుజాలపై చేతులు వేసి
మాలో ఒకనిగా ప్రేమ నటించి

తెలియని నిఘా పెంచుతాడు
అదనుచూసి దెబ్బపై దెబ్బవేస్తాడు
వాడు అగ్రవర్ణానికి చెందినవాడని
ఏకోసాన బయట పడనీకుండా
రాజ్యాంగం మాటున
ప్రజాస్వామ్య ముసుగులో
మెరిసిపోతూ మురిసిపోతాడు
చెదరని చిరునవ్వుతో స్వారీ చేస్తూ తారసపడతాడు
మా తాలూకు బతుకుల్ని తెలియకుండ బలితీస్తాడు
దేశ సంపదకు వారసుడై దిగువవారిని దగాచేస్తంటాడు
ఈ ద్రోహం ఇంకానా ఇకపై చెల్లదు
రిజర్వేషన్లతో ఏకతాటిపైకొచ్చి
పూలే అంబేద్కర్ ఆశయాలదిశగా
రథం నడిపిస్తున్నాము
రాజ్యాంగం దిశగా సంసిద్ధులౌతున్నాము
మీ కపట నాటకాల కుట్రలు
బయటపెట్టి ఏక లక్ష్యంతో వస్తున్నాం
కోల్పోయిన కాలాన్ని వెనక్కినెట్టి
మా రాజ్యాధికారం దిశగా
అడుగులు సవరించుకుంటున్నాం
మా వాటా సాధనకై దేవురించు
రోజులను మార్చబోతున్నాం
దగాపడ్డ బతుకులు సరిదిద్దుకునే
ఆశయంతో అడుగులు వేస్తున్నాం
బిసి డిక్లరేషన్ అజెండాగా
కొత్తజెండా ఎగరేయబోతున్నాం !!

– బివివి సత్యనారాయణ
అమలాపురం, తూర్పు గోదావరి జిల్లా – 9912233739

26. నీళ్ళు లేక కన్నీళ్ళ బతుకు

ఎన్నో శెరలవడి
బత్కెటి బత్కు తెల్గోల్లది
పొద్దెక్కితే పొయ్యిల సూర్యుడెలగడు
మాపయింతల పేగులకు నిద్ర సైసదు
ఏమి బత్కులు ముత్తరాసొలది
నీళ్ళమీద నాసు బత్కులు
నాల్కమీద ఉమ్మి బత్కులు
కాలం... సెరువు కట్టపై కుంటుకుంట
ఎల్లని బత్కుల మీద
పొత్తికడ్పుల కాళ్ళతో తంతుంది
నీళ్ళు లేని సెరువుల
మా కన్నీళ్ళను నింపుతుండది
పర్కలు కంచెలతో తానమాడె ఎత్తెల
ఎతలనన్నీ నింపుకోని కూలవడే
గూడశాటల గోడు
గుడిసె గూటాలకు బోర్లిచ్చుకోని
ఎల్లబోసుకోవట్టె
సెరువంటే సొంత తల్లి లెక్క
తల్లిగుండెల పాలులేక
తండ్లాడెటి బిడ్డలమైనం
కొరమట్ట పిల్లలను
కౌగిలించుకునే కొడిమె
కొయ్యకు వేలాడి
తుప్పువట్టి రాలుతున్న
నరాలను పేనుకుంటుంది
ఆదెరువు లేక తెల్గోల్లది ఈనాడు
అంగడి బత్కులాయె
సింతకాయలు సింతవలకాయలు
నేరెడివండ్లు జాంపండ్లు
ఏ సీజనొస్తే ఆ కాయలే
మా నెత్తిన చెదరని సంతకంజేసి
చెదురుతున్న బత్కులను నిల్పవట్టె
పొద్దునే నెత్తిన ఎక్కిన గంప
పొద్దింకల బరువును దించి పోతది
మా బత్కులన్ని
సేండ్లకాడ సెలకల కాడ
మూటలు మోసెకాడ
గోడలు వెట్టేకాడ
షాపులల్ల, దాని గేట్లకాడ
ఏడ జూస్తే ఆడ
ముండ్లతీగలపై అల్లుకున్న
ముదిరాజులమైనం
కులవృత్తి కూలిపోయి
అడ్డమీది కూలిలైనం
సెరువు మత్తడి దుంకితెనే
మా సంతోషం అలుగెల్లి పారుతది
ఎండుచేపలు మా గోళ్ళెం నిండితెనే
పండుగై మా ఇండ్లల్ల
పాలు పొంగుతై

– బోల యాదయ్య
మహబూబ్ నగర్ జిల్లా
9912206427

27. ఆకలిచావు

తరతరాల వృత్తిని నమ్ముకున్న పాపానికి
బతుకంతా అతుకులమయమే
మూరెడు బట్ట నేసినా
జానెడు పొట్టనిండని దౌర్భాగ్యం
పగలంతా పట్టు పుట్టాల్ నేసినా పస్తులు
ఆస్తిపంజరాలే వాళ్ళ ఆస్తిపాస్తులు
కాయలు గాచిన చేతుల్లో
కష్టాలు తిష్ట వేసుక్కూర్చుంటాయ్
ఇనుప గజ్జెల తల్లి వానిల్లు, ఇల్లాలు, పిల్లల్ని
గుత్త చేసుకుని పెత్తనం చెలాయిస్తుంది
ఆకలి, రోగాలు, రొప్పులు, అప్పులూ
అనుక్షణం రాబందుల్లా పీక్కుతింటాయ్
గుప్పెడు వసంతం కోసం
చెట్టు ఆకుల్ని రాల్చుకున్నట్లు
తమ కళల సర్వస్వాన్నర్పించి
కలల అంచుల్లో వేళ్ళాడుతుంటారు
నిత్యం మృత్యు గీతాల్నాలపిస్తూ
అక్కడ శవాలుగ బ్రతుకులీడుస్తున్నారు

– పున్న అంజయ్య
9396610639

బి సి క వి త

28. కులవృత్తుల వెతలు

ప్రపంచీకరణ నేపథ్యంలో
సాంకేతికత.. మానవీయ హద్దుల దాటి
పయనిస్తున్న సమయాన
కుమ్మరి సారెలు ఆధునిక పోకడలనే
ఉక్కు పాదాల నడుమ నలిగిపోతున్నాయ్
కమ్మరి కొలిమిలు మిణుకుమిణుకుమంటున్నాయ్
గీతకార్మికుల తలరాతలు
మోకు పీకకు చుట్టుకున్న రీతిన సాగుతున్నాయ్
చేనేత బతుకులు
ఎలక్ట్రానిక్ మగ్గాల చితిపై ఆహూతవుతున్నాయ్
తాపీమేస్త్రీల తపన
యంత్రాల పునాదిలో తాపడమౌతున్నాయ్
దర్జీల దర్జాలు కంప్యూటర్ కనుసన్నలలో
కొట్టుమిట్టాడుతున్నాయ్
స్వర్ణకారుల నైపుణ్యం యంత్రాల
కబంధహస్తాలలో చిక్కుకుని సతమతమవుతున్నాయ్
హద్దులుదాటిన సాంకేతికత
కులవృత్తులవారిని అచేతనులను చేసి చిదిమేస్తున్నాయ్
టెక్నాలజీ భూతాలు వామనరూపాలలో
ఇంతింతై వటుడింతై భూమండలంపై
తమ పాదాలని మోపి నలిపేస్తున్నాయ్

– కొమ్ముల వెంకట సూర్యనారాయణ
రాజమహేంద్రావరం – 9949602721

29. పునాదిరాళ్ళం మేం!

ఎండకోర్చి చెమటరాల్చి
డొక్కరెక్కలు ముక్కచేసి
చేతపుట్టిన కళలు కూర్చి
సంఘచేవకు సేవచేసిన
వెనకబడిన జాతులం
వెలుగు తగ్గిన జ్యోతులం

పాతరాతియుగం నుండి
కొత్తతరముకు దారులేసి
అందలానికి, అవసరానికి
కాయకమ్ములు ధారవోసిన
పల్లె గతులకు ప్రగతులం
మల్లె మనసుల బీసీలం

రాజరికమే మారిపోయె
రాజులెందరో కూలిపోయె
తరాజు లెవ్వరు తూగలేరు
మా రాజ్యమెపుడూ చూడలేదు

కాలిపాదం మొదలునుండి
మెదలు మోసె శిరసు వరకు
నేడు వాడే ప్రతి వస్తువు
మా శ్రమల, వృత్తుల చాటు సత్తువ

ఓటు బ్యాంకుల కేటుతనములో
రాటుదేలే రాగమందక
త్యాగధనులై తరలుతున్నం
పొరుగుదేశం బైలెల్లుతున్నం
అధికారానికి దూరమవుతూ
ఆర్థికానికి భారతమవుతూ
పున్నమిలేక చీకటనున్నం
పునాదిరాళ్ళై కూరుకుపోతున్నం
మేం వెనకబడిన కులాలం
మేం వెనకడుగు వేయని బలాలం!!

– మదపతి జగదీశ్వర్
ఉపాధ్యాయులు
నారాయణఖేడ్ – 9494817919

బి సి క వి త

30. పునరుజ్జీవం

వెనుకబడిన కులాలంటూ
వర్గీకరించి వివక్షచూపిననూ
వెనుకటి కాలమే
ఆదరణకు నోచుకున్నాయి కులవృత్తులు
అభివృద్ధి పథంలో నడుస్తున్న నవయుగంలో
కులాల మధ్య రేఖలు కనుమరుగయ్యే వేళ
కానరాకపాయే కులవృత్తులు
కుమ్మరన్న కుండలు, కమ్మరన్న పనిముట్లు
యంత్రోత్పత్తులే మింగేసే
నేతన్న చీరలను, అవుసులన్న నగలను
ఆధునికత ఆవలతోసే
ప్రపంచీకరణతో మారిపోయే జగత్తు
విదేశీ వస్తువుల దిగుమతితో
అంగట్లో మన చేతివృత్తులకు విపత్తు
నాసిరకం ఉత్పత్తుల వెంటపడుతూ
నాణ్యతను త్యజిస్తున్నామని గ్రహించిన వేళ
మెల్లమెల్లగా పునరుజ్జీవం పోసుకుంటున్నాయి కులవృత్తులు

– స్వప్నకృష్ణ
హుజురాబాద్ – 9440536669

3

బి.సి. చైతన్యం - ఆవశ్యకత

బి సి క వి త

1. మహాజన్ మార్చ్

విత్తనం కన్నుతెరవకుండా
భూమి పెత్తనం ఎన్నాళ్ళు
న్యాయం రెక్కలిప్పుకోకుండా
కుట్రల ఉరులెన్నాళ్ళు
మూడో కన్ను తెరుచుకుంటది
సామాజిక న్యాయం
ఆకాశమంతా విశాలమైనది

పీడితుల పాటకు
సింగిడిలోని రంగులే సప్తస్వరాలై
రాగాలు పోతపోస్తయి
సమ న్యాయమే సర్వజనహితమై
బహుజన కెరటాలు సింహనాదమై విప్లవిస్తయి
మమతలు అడుగంటినప్పుడు
అడుగు కులాలు గుండెలపై జెండాల్ని
విజయనాదమై ఎగురేస్తయి!

వానలు ఎప్పుడు ఒకటేలాగపడవు
కాలం ఎన్నడైనా వెనక్కి మల్తది
పడమర దిక్కున పొద్దు పొడుస్తే
అస్తిత్వాలు అజేయాలై నిలుస్తయి!

భగభగ మండే కొలిమిలో
నిప్పుకణికలు అక్షర ఆకురాళ్లయితవి
చెల్లాచెదురైన ఇటుకలు తట్టలు
చెరువుకట్టగా పోతపోసుకుంటవి

మట్టిమనుషులే మందారాలై
బోధివృక్షాలై వికసిస్తయి!

కాలం మల్లిన వాన
ఎదురుచూసిన వాన
కుమ్మరి వాములపై కురుస్తే
నల్లటి మట్టిలోని సారెలు
ఆశోకచక్రాలై మెరుస్తయి!

చాకి రేవులు మంగలి అసిపెలు
గొల్లకురుమల గొద్దలిచిప్పలు వడ్డెర గన్నులు
గుండు, దారం, సుత్తె, మెట్నలు
మ్యాదరి కత్తులు మేర కత్తెరలు
మాసిపోయిన అడుగు జాడల్ని
జెండాలుగా ఎగురేస్తరు
తగ్గి దారాలను మిగ్గులో అద్ది
నవ సైరన్ మోగిస్తవి వలలు
డిల్లెం బల్యేం బీరప్పలు మద్దెల చిడుతలు వీణలు
తంబూర ఏక్తారా సకల నాదాలు
మోకు, గీత పూసల బతుకుతాడులు
కావ్య కిరణాలై కొత్త స్థూపాన్ని ఆవిష్కరిస్తయి!

కన్ను మిన్నును మింగిన కొండచిలువల
గొంతుల నలిపెయ్య రంకెలేస్తున్న గంగిరెద్దులు
తేనెపట్టునుండి తేనెను పిండిన చేతులు యుద్ధానికి
సైసై సైరా గజ్జలుకదుతయి
నాదస్వరాలు నాగస్వరాలు
మహాజన్ స్వరాలై మార్చ్ చేస్తయి!

బి సి క వి త

తరతరాల అరిమాయల అపర పన్నాగాల్ని
ఎండగట్టడానికి
ఒగ్గులు జగ్గులై కదులుతవి
మగ్గాలు రాట్నాలు
మహాజన పతాకాన్ని నేయ
కొత్త దారాల్ని ఒడుకుతయి!

నది ఆగిపోదు
కాలం ఆగిపోదు
సమ్మక్క సారక్కల గద్దెల సాక్షిగా
మూలసుక్క పొడుస్తది
రేపటి కలాలన్ని
రాజ్యాధికార రణభేరికై
బహుజన సూర్యులై పోటెత్తుతయి
సమూహం ప్రవాహమై ఉప్పొంగుతుంది
వానలు ఎప్పుడు ఒకటేలాగ కురువవు
గత మోసాలు, ద్రోహాలు, దురాలోచనలు
పటాపంచలైతవి
కాలం వెనుకకు మల్లది
వానొచ్చేదే ఆలస్యం!!

– వనపట్ల సుబ్బయ్య
భార్గవి హేర్ స్టైల్స్
నల్లవెల్లి రోడ్, నాగర్‌కర్నూల్ – 9492765358

2. చైతన్యమే ధ్యేయంగా...!

కాలంమారినా, రుతువులు మారినా
ప్రభుత్వాలు మారినా
రాజకీయ నాయకుల చిరునామాలు మారినా
మారనిది ఒక్క వెనుకబడిన తరగతులే
కుచేల సంతానంలా
ఉన్న కులాలన్నింటిని 'బిసి'నే అంటూ
వివక్ష చూపుతున్న స్వార్థపూరిత రాజకీయం
భూస్థాపితమవ్వాలి
ఇది వెనకబడిన కులం కాదు
వెనక్కి వెనక్కి తోసేసి తొక్కబడిన కులం
సామాజికంగా అందరూ ఎదగాలి
పత్రికా ప్రకటనలో హాస్యం తొంగిచూస్తుంది
రిజర్వేషన్ల పేరుతో అభివృద్ధిని గల్లంతు చేస్తున్నారు
కలసి నడవాల్సిన అవసరం ఇదే
చేయూత నీయాల్సిన క్షణాలివే
చైతన్య కెరటాలై
గమ్యాన్ని చేరవలసిన సమయం ఆసన్నమయింది
సమీక్షల కాలం చెల్లింది
సంఘటితంగా వెనకబడిన కులాల ఐక్యతను చాటి
అందలమెక్కాల్సిన తరుణమిది
అదే విజయం.. అదే బిసిల గౌరవం
అప్పుడే బిసిల జీవితానికి రక్షణ, సంరక్షణ

- పూర్ణకృష్ణ
సంగారెడ్డి - 9491562006

3. పల్లకిలో బోయిలు

ఎంత కాలం ఈ మోతలు
ఇంకెన్నినాళ్లు వారి అడుగు జాడలు
పదవీ వ్యామోహంతో పల్లకిలో ఊరేగుతున్న
అగ్రకుల ఆధిపత్య పోకడను
బోయిలుగా మోయడమేనా మన భవిత
తరాలు మారుతున్నాయి
మన స్వరాలు వారికి జేజేలు
పలుకుతూనే వెంట నడుస్తున్నాయి
జనగణనలో అగ్రతాంబూలం కాదు
జయపతాకంపై మన ముద్రపడాలి
ఐక్యతలేని అక్షర జ్ఞానం ఉన్నా ఒకటే
లేకున్నా ఒకటే
చలిచీమల సర్పం కథ చదివినా
చైతన్యానికి ఆమడ దూరమేనా
అసూయ, ద్వేషాన్ని పాతర వేసి
పాతాళానికి అణగదొక్కే పల్లకిని
పడేసి పదవులు అందుకోండి
కులాల కుమ్ములాటలతో విభజించి పాలించే
కుట్రదారుల కుతంత్రాలను అంతం చేసి
నాయకత్వానికి స్వాగతం పలకండి
అనుచర స్వభావాన్ని వీడనాడండి
బహుజనుల బలాన్ని చూపండి
భావితరాలకు వారధి వేయండి
ఓటు మనదే.. సీటు మనదే.. పీఠం మనదే

– దుర్గమ్ భైతి
రామునిపట్ల, సిద్దిపేట జిల్లా – 9959007914

బి సి క వి త

4. బిసి ప్రాంగణం

బహుజన సామ్రాజ్యం, బీసీ ప్రాంగణం !
కీలక వృత్తుల్లో, ఖిలాడీ నైపుణ్యం !
భువికి మూడు వంతుల నీరులా –
ఇమిడి ఉన్నారు బీసీలు సకల జనుల !

అధిరోహణ నిచ్చెనలో, అధిష్ఠానంలో
ఎరుపురంగు మిర్చిలో నాటుఘాటుల !
వినిపించే మృదంగ ధ్వనిలా !
వృత్తి ధర్మమున హృదయమై –
విధుల కెరటాలై !
బారెడు బతుకులో, గోరు దీపమున –
సమస్య వలయమున విలపిస్తున్నా–
బీసీ కులాలు !!

అగ్రకులాలకు ఆదినుంచి గౌరవస్థానము
చెరగని చిహ్నము!
చివరి కులాల మెరుగుచేయ –
సర్కారు కోటలు, చేరగా చేయూత !
ఎటునుంచి దారి లేదు ఎదగగ –
ఆదుకునే హస్తం అసలే లేదు !
ఎదిగేటి వృక్షంలా, కదిలేటి కడలిలా –
తనకు తాను చేయుతగ –
నేడూ అధిగమిస్తున్నా బీసీ కులాల !
బీసీ పర్వంలో వృత్తివిద్యలనేకం –
నునూతన విధానము ముంగిట్లో– వున్నాయి !

బి సి క వి త

అంతర్జాల వీధుల్లో, శంఖారావం పూరించి
దశదిశలుగా ఎదుగుతున్న బీసీ కులాల !
డ్వాక్రా మహిళ సమగ్ర చైతన్యం !
డాక్టరు ,ఇంజనీర్ ,శాస్త్రజ్ఞుడు నేడు
బీసీ కులాల క్రతువులు !!

గొంగలి వీడిన సీతాకోక చిలుకవలె –వేదమును వల్లిస్తూ ,
చట్టసభలలో కంఠాన్ని మ్రోగిస్తూ –
కలలకు వన్నె తెచ్చు కర్తలై !
సాహిత్య పోషకులై !
సమాజపు పాలకులై !
మధ్యతరగతి మార్చుగా –
పురోగతి చెర్చుగా !!
పుంజుకున్న బీసీ కులాల !!

చతుర్ముఖ బావుటాలు ఎగురవేయ
పయనమైన బిసిలు !
రాబోయే కార్య రంగములు –
కాబోయే బీసీ ప్రాంగణాలు !!

– కందూరి సుజాత గౌడ్
కవయిత్రి, రచయిత్రి, సమాజిక కార్యకర్త
రాజేంద్రనగర్, హైదరబాద్ – 9392162822

5. మా సత్తాచూపిస్తాం

బడుగు - బలహీనులమని
చులకనగా చూడకండి !
ఆది యందు అందరిదీ
ఒకటే తెగ తెలుసుకోండి !!
కుయుక్తితో మము వేరు చేసి
ఎనకెనకకు నెట్టినారు !
మా "పాలు"ను కాజేసి
మొండి చెయ్యి చూపి నారు !!
మేం అహరహము శ్రమించే
కార్మిక, కర్షక, శ్రామికులం... మేం
పాడిపంటలతో మీ కడుపు
నింద తిండిబెట్టి... మా రక్తాన్నే
చెమటజెసి ఈ ఇలాతలమునే
నందనవనముగ సుఖ,
భోగాలను మీ కందిస్తున్నాం !
కృతఘ్నులై మీరు మాకు
అన్యాయం చేస్తే ... చూస్తూ
చేతులు ముడుచుకు
కూచోము మేము !
మా సత్తా చూపిస్తాం
మే మేంటో నిరూపిస్తాం
మా హక్కులు సాధిస్తాం !

- కోరాడ నరసింహా రావు
శ్రమశక్తి నగర్, చినముషిడివాడ,పెందుర్తి (మండలం),
విశాఖపట్నం - 9441821235

బి సి క వి త

6. బిసి జాగృతి గీతం

పల్లవి: మేము బిసి పౌరులం – మేము వెలుగు దివ్వెలం
మహాజనులమూ మేమే – మహోన్నతులమూ మేమే
మానవతా వాదులం – సమతాభావుకులం (2)

చ॥ మిలీనియం చరితకు – మేము సాక్షిరూపులం
మట్టిమనుషులం మేము – మాతృభూమి ప్రేమికులం
జనం మేలుకొలుపుకై – జన జాగృతి చైతన్యం ॥మేము॥

యెనకబడ్డ కులాల – యెతలన్నీ మాపుటకు
చేయి చేయి కలుపుదాం – ఉద్యమమై కదులుదాం
రాజ్యాధికారమే – మన అంతిమ లక్ష్యము ॥మేము॥

జనం మనది బలం మనది – సంఘటిస్తే జయం మనది
ఓట్లు మావి సీట్లు మీవా? చెల్లదు ఇక చెల్లదు?
గడ్డిపోచలేకమై గజమదమే అణిచినట్లు ॥మేము॥

సర్దార్ పాపన్న పోరాట వారసులం
చాకలి ఐలమ్మ పొత్తిళ్ళ పౌరులం
దొడ్డి కొమురయ్య ఉద్యమా రూపులం
లక్ష్మణ్ బాపూజీ లక్షణాల బిడ్డలం
పూలే సావిత్రిబాయి జీవితాల పాఠం
బహుజనా సేవకులకు ప్రేరణా పాఠం
తెలంగాణ బిసిలకీ ఇదే స్ఫూర్తి పాఠం ॥మేము॥

జై బిసి – జైజై బిసి! జై బిసి – జైజై బిసి!

– నకిరేకంటి శీనయ్య
వృక్షశాస్త్రోపన్యాసకులు
ఆదర్శపాఠశాల, బొమ్మలరామారం – 8008969621

బి సి క వి త

7. వెనుకబడుతున్న కవిత !

వెనుక పడ్డ జాతులన్ని
పేనుకున్న ఐక్యత రజ్జుయి
ఇప్పుడిప్పుడే అవకాశాల్ని
చెప్పుచేతుల్లోకి తీసుకున్నం !

తరతరాల అంతరాల్ని
నరనరాన జీర్ణించుకుపోయిన
అస్తవ్యస్త సమాజంలో
సుస్థిర భారతంలో కీలకమైన !

బాంచన్ స్థాయి నుంచి
శాసించే భరోసా నవగీతమై
పీడిత తాడితుల సెలయేరులమై
బతుకుదారులకు సాగునీరైనం !

శ్రమదోపిడీ చెరసాల నుంచి
భ్రమమాటల మోసాలోంచి
తేరుకుని నిజాలేరుకుని
తూర్పుదిక్కు సుప్రభాతగీతులైనం !

అన్యాయాక్రమాల వెనుక
అవినీతి దురాక్రమణలను
అడుగడుగునా ఎదురిస్తూ
బెదిరిస్తూ.. వాటి వెనుక బడుతూనే ఉంటం

వెనుకబడినవాళ్ళం కాదు
జాగ్రత్త సుమా!
అణచాలనుకునే వారి
వెనుకబడేవాళ్ళం...!!

డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి
9490145913

బి సి క వి త

8. సంఘటితంగా కదలుదాం!

“వెనుకబడిన తరగతులు” అంటూ
ఓ ముద్రవేసి జండాకర్రలు చేతికిచ్చి
నినాదాలు చేయిస్తారు !
“రేపటి అధికారం మీదే” అంటూ..
నాయకులు నమ్మకంగా పలుకుతారు!
తీరా అధికారపీఠం అందుకున్నాక
జెండాకర్రలెత్తి నినాదాల హోరెత్తించి
నాయకులను తమ భుజాలపై ఎత్తుకుని
గెలిపించిన వారందరినీ పక్కకి నెట్టేసి
తన బంధువర్గం వారికి తన స్వపక్షం వారికి
పదవులు పంచుతారు !
నాయకులంతా తనవారే అవగా
తన స్వార్ధ రాజకీయ అనుభవాన్నంతా ఉపయోగించి
మహానాయకులుగా ఎదుగుతారు !
తను ఎదిగే క్రమంలో.. తనకి
ఆసరాగా నిలబడిన వారందరిపై పెత్తనాన్ని చెలాయిస్తూ
దర్పం ప్రదర్శిస్తారు ! ఇలా ఎంతకాలం ?
దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 73 సంవత్సరాలైనా
వీళ్ళ తీరు మారలేదు.. ఇకనైనా గ్రహిద్దాం
బి.సి.లు అందరం సంఘటితమవుదాం!
రాజ్యాధికారం దిశగా కలసి అడుగేద్దాం !
“స్వయం ప్రకాశకులమై” వెలుగుదాం!
“విజయం మనదే !” అందరం కలసికట్టుగా శ్రమిస్తే ..!
అందుకున్న అధికారాన్ని అందరం
ఆనందంగా కలసి పంచుకుందాం!

– గొర్రెపాటి శ్రీను

హైదారాబాద్ – 9652832290

బి
సి
క
వి
త

9. బి.సి.ల ఆశాకిరణం

కథకుడా ! నవలాకారుడా ! వ్యాసకర్త !!
ఉద్యమాలకు ప్రాణం పోసిన ఉద్యమకారుడా !!
బహు గ్రంథకర్త బహు జనోద్ధరణ కుమారుడా!!
సామాజిక తత్వవేత్త తెలంగాణ బీసీల ఉద్దరిని
సాహిత్య సామాజిక సేవ నిరంతర శ్రామికుడా!!
అపర భగీరథా... శ్రీరామనామ సార్థకుడా!!!
సమాజ పరిణామ క్రమానికి, మార్పుకి నీవే వారధి
సమాజ కులవృత్తుల మనుగడకి నేర్పు నైపుణ్యం
మేతరి నేతరి కంసాలి గీత కార్మికుడివి నీవే !
కమ్మరి కుమ్మరి వడ్రంగి మంగలి సకలము నీవే !
నేడేది లేదే ఆ కళా సౌందర్యంఎక్కడ ?
నీ మనుగడ ఎక్కడ ? నీవెక్కడ ? నిను తలచే వారెవరు?
నీ రాకకై వేచి చూసే దెవరు?
పల్లెలు దేశానికి పట్టుగొమ్మలని గాంధీజీ మాట
రైతేరాజని రాత్రి పగలు కష్టించే
పట్టెడన్నం పెట్టే పరంధాముడతడని
సబ్బండ సమాహారమే కులవృత్తులని
నాటి మాట కాగా, మరి నేటి మాట?
నేడు చదువు సంధ్యలకై ఉపాధికై
పల్లెలు వదిలి పట్నం బాట పట్టే యువత
కులవృత్తులే జీవం లేని నిర్జీవ వృత్తులైతే
ఇక మళ్లీ రావాలి పూర్వవైభవం
అందుకు మనమంతా చేయాలి చైతన్య సమరం!!!
చట్టసభలలో రావాలి మార్పులెన్నో
ఏ రంగంలో చూసిన వారి ప్రత్యేకత వారిదే!!

బి సి క వి త

బి సి క వి త

ఓ వైపు సాహిత్యం, సామాజికం, రాజకీయం
విద్యా, వైద్య, మేధావులు, సంపన్నులు వారే !!
జ్యోతిరావు ఫూలే సావిత్రిబాయి ఫూలే లా
కృషియే నేటి విద్యా వ్యవస్థ ప్రగతి పథం!!!
ఇక రావాలి మనలోనే మార్పు నిరంతర
కులవృత్తులు విద్యా రాజకీయ చట్టసభలలో
ఉద్యోగాలలో మన రిజర్వేషన్ పోరాటం
మార్పు చైతన్యం .. ముందు తరాల వారికి
మనమంతా ఆదర్శ ప్రాయులమై నిలవాలి
మన కీర్తి చరిత్ర పుటలలో ఆచంద్రతారార్కమై
నిలిచేదాక మన హక్కులకై పోరాడుతూ
బాధ్యతలను స్వీకరిద్దాం
పదండి ...పదండి
ఇక మనమంతా ఒక్కటిగా కదులుదాం
మునుముందుకు..!!!

– పున్న విజయలక్ష్మి
కలం: భాస్కర విపంచి
తెలుగు ఉపాధ్యాయురాలు
సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల / కాలేజీ
షేక్పేట, సరూర్‌నగర్, హైదరాబాద్ – 9491875276

10. నవాబు లాలి ... గరీబు లాలి

ఖబాబులు తిన్న
నవాబులు కారు
గంజి త్రాగు తున్న
గరీబులు వీరు
సలామ్ అంటే
గులామ్ కొట్టే
నవాబులు కారు
రెక్కలు ముక్కలు చేసి
డొక్కలు నింపు వీరు
చీకట్లను ముక్కలు చేసే
వెలుతురు చుక్కల తీరు
అసమాతల సారమే
బ్రతుకు భారమైన తీరు
కోటలు లేని నవాబులు
కూటికి లేని గరీబులు
కోట్లు లేని కుబేరులు
నాణాలు లేని నవాబులు
పేరుకే నవాబులు ...!!
పైసాలో గరీబులు..!?

నవాబు అయ్యే గరీబు
గరీబు కాదు నవాబు
ఇది వాస్తవపు విల్లు
ముస్లింల పొదరిల్లు
నవాబుల హరివిల్లు
వారి జీవితములో..
కురవాలి సిరి జల్లు
వెలగాలి ... సిరివెన్నెల
అని కోరుకుందాం
ప్రతి గరీబు నవాబు
అయ్యేలా చేసుకుందాం
అదే దేశ ప్రగతి
అదే జాతి స్వగతి
ప్రతి ఒక్కరు స్వాగతిద్దాం
ప్రతి ఒక్కరూ సాదిద్దాం

– షేక్ మస్తాన్ వలి
జంతు శాస్త్ర అధ్యాపకులు
నవ్యాంధ్ర గీత రచయిత
సెల్ : 99 483 57 673

బి
సి
క
వి
త

11. నీ చరిత్ర నువ్వే రాసుకోవాలి

మనిషి ఎక్కడో ఒకచోట జీవిక మొదలెట్టాలి
బతకడానికి తప్పదు కదా
తాతలనాటి ఆస్తులుంటే అందరూ చక్రం తిప్పుతారు
బతుకు బండి నడవటానికి నువ్వే ఇరుసు వవ్వాలి
రోజంతా ఒళ్ళు హూనం చేసుకుంటే
పొయ్యి రాజుకుంటుంది పగలు తింటే రాత్రికుండదు
ఒక్కోసారి పగలు రాత్రి పస్తులే భూమి నిండా మనుషులుంటారు
భూమి కొందరి చేతుల్లోనే ఉంటుంది
తిండి లేక కొందరు తిన్నది అరక్క కొందరు
అనాదిగా ఇదే వరస లెక్కలు తేలటం లేదు
జెండాలు మారుతున్నాయి ఎజెండాలు అక్కడే ఉన్నాయి
చట్టాలు మారుతున్నాయి న్యాయం జరగడం లేదు
పంచుకోవడానికి లెక్కలు కావాలి
అధికారం పంచుకోవడానికి అవేవీ అక్కర్లేదు
దేశం నిండా బీసీలున్నారు అధికారం మాత్రం ఓసీలదే
భయపెట్టో బామాలో బీసీలను అక్కడే ఉంచారు
నోటుకి సారా చుక్కకి అలవాటు పడ్డ ప్రాణాలు
ఓటు విలువ ఎప్పుడు తెలుసుకుంటారో
మేలుకోకపోతే నువ్వక్కడే ఉంటావు
రాజ్యాధికారం మాత్రమే నిన్ను రాజుని చేస్తుంది
కలవడానికి మనుషులున్నారు ఎత్తడానికి చేతులున్నాయి
బిగించడానికి పిడికిలి ఉంది పిడికిలి బిగించనంతవరకు
కాలం కరుగుతూనే ఉంటుంది ఒక్కసారి పిడికిలి బిగిస్తే
రాజులే కాదు రాజ్యాలూ కూలిపోతాయి
నీ రాజ్యం నీకొస్తుంది.. చరిత్ర తనంతట తాను రాసుకోదు
నువ్వు పోరాడితే చరిత్ర అవుతుంది
నువ్వు రాస్తే చరిత్ర అవుతుంది.. నీ చరిత్ర నువ్వే రాసుకోవాలి

– చొక్కరతాతారావు
విశాఖపట్టణం – 63011 92215

బి సి క వి త

12. చైతన్యం మన ప్రారంభం కావాలి

కదలని పర్వతాలు ప్రభావం చూపుతాయి
నిరంతరం వాతావరణాన్ని మారుస్తూ
ఆకాశానికెగిరే దేహాలకెందుకు వెనుక బాటు
పిల్ల కాలువల ధాటికి విలపిస్తున మహా సముద్రాలు
విజృంభించే కాలం రావాలి
మట్టి పొరల్లో గూడు కట్టుకున్న నిస్తేజం
చైతన్యపు రెక్కలు విప్పుకుంటే
కుళ్ళు వాసనతో జలదరింపు వస్తుంది
చివికిన ఆలోచనలకు సమాధికట్టి
అణచేటోనికి అంతరిక్షం చూపాలి
శిథిలమైన బతుకులు నవజీవనంతో ఉత్తేజితమయ్యేలా
ఉత్తుంగ తరంగమై కదలాలి
జడంలా ఉన్నా జనం లావాలా కదలాలి
కరుడు గట్టిన లోహాలను కరిగించే తీరాలి
గుంపులుగా ఉన్న గుండెలు
ఒంటరి దుర్నీతులకు దుద్దుగా మారేకంటే ఎవరెస్ట్‌ను సాక్షి చేసి
ఎదఎదలో వెలుగు నింపుకు ముందుకు సాగే చైతన్యం
బి.సి.ల కథకు ప్రారంభం కావాలి

– రమేశ్ గోస్కుల
హుజురాబాద్
కరీంనగర్ జి ల్లా
9703388584

బి
సి
క
వి
త

13. ప్రగతి పథాన పయనిద్దాం

భగవంతుని బహుమానంగా వృత్తులనెన్నో చేపట్టి
సమాజగమనానికి మార్గనిర్దేశకుల మయ్యాము
కానీ... స్వార్ధపరుల ఉక్కు పాదాలక్రింద నలుగుతూ
నుదిటి రాతలు మార్చుకోలేక
యెన్నెన్నో ఉపకులాలుగా విభజింపబడి
ఏళ్ళ తరబడి వెనుకబడిన వర్గంగానే
ఈ సమజాన మిగిలిపోతున్నాము
బి.సి.లు ఏకమైతే రాజ్యాధికారం తమకు రాదని తలచిన
రాజకీయ దురంధరులు కులాల కార్చిచ్చుతో రెచ్చగొట్టి
మన ఐక్యతను భంగపరుస్తున్నారని గ్రహించలేక
నిరాశతో.. సుదీర్ఘ నిశారాత్రులనే గడుపుతున్నాము
వ్యూహాత్మకంగా పోరాటం చేయకపోతే
రేపటి తరానికి అందబోయేవి విచ్ఛిన్నకర స్వప్నాలే
రాజ్యాధికారం లేకుండా సాధికారికతను
సాధించలేమనేది కాదనలేని సత్యం
అందుకే ఓ బి.సి. సోదరా
అంతర్గత విభేదాల కుంపట్లతో సిగపట్లు పట్టకుండా
మానవతా పందిళ్ళు వేసి ఐక్యతా రాగాలను పలికి
జ్యోతీరావు పూలే స్ఫూర్తితో చేయి చేయి కలుపుదాం
ప్రగతి పథాన పయనిద్దాం

– సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు
కవి, రచయిత, సమీక్షకులు
అశ్వారావుపేట, భద్రాద్రి జిల్లా
9491357842

14. కర్తవ్యం

పాడి పంట దేశ ప్రగతికి మూలము
పలు కులముల యొక్క పాత్ర కలదు
కలిసి మాదిగన్న కమ్మరి వడ్రంగి
పనులు చేయపంట ఫలము వచ్చు

శాతము పది లేదు శాసించుచున్నారు
తొంబదున్న నీవు తొండి యనవు
ప్రగతి కారకుడవు బానిస వైనావు
మాంద్యమయ్యె బుద్ధి మతము పేర

నెత్తి మీద వుండి సుత్తితో కొట్టిన
ఎదురు తిరుగవైతి యెందు కనుచు
హిందు మతము పేర కిందున్న వాడని
అదిమి పట్టుటేల ఆగమయ్యి

పనులు చేయ నోళ్ళు బ్రాహ్మణ వైశ్యులు
పాలకులయినారు పట్టదేల
పనులు చేయువారు ప్రగతికి మూలాలు
ఏకమైన రాజ్య మేలగలము

కలిసి నడవకుండ కట్టిరి కులగోడ
చిన్న పెద్ద కులము చిందులుండు
మతము యొకటియైన మనుషుల విడదీయు
మార్గము కులమందు మనకు కలదు

బీసి ఎస్సిలంటు బిగుసుక కూర్చోక
కలిసి నడవ వేల కదనమునకు
పోరు సల్పకుంటె పోబోదు యీ స్థితి
తెలిసి నడువ వలయు తెగలు మరచి

సమర వీరుడయ్యె సర్దార్ పాపన్న
సంఘటిత పరుచగ సర్వజనుల
కూడి నడువ నేర్పు కులగజ్జిని విడిచి
భరత ప్రజకు మంచి భవిత నివ్వ

– బి నారాయణ
హైదారాబాద్
9440065312

15. చేతనాయుధం

బి సి క వి త

పిడికిలి బిగించి జై కొట్టు
బీసీలైక్యత నీ పట్టు
ఐకమత్యమే ఆయుధమంటూ
పిలుపునివ్వు వినిపించేట్టు !
పూర్వ తలరాత మారాలి
ముందు భవిష్యత్తు మార్చాలి
ఎగిరే కెరటం నువ్వవుతూ
యువతకు మార్గం చూపాలి !
బలము బలగం మనమేగా
అడుగడుగున మన శ్రమయేగా
ఇంకెన్నాళ్ళీ బానిస బతుకులు
విముక్తి ఢంకా మ్రోగెనుగా !
పదపద అడుగులు కలుపుకుని
భేషజాలు తెగవేసుకుని
ఏక్తాగీతం 'గీత'గ మార్చి
విజయ తీరాలనందుకుని !
నూతనచేతన ప్రపంచమందున
మార్పుకోరేటి మార్గమందున
తరాల చరితకు ఉక్కుకంచేసి
జీవిద్దాం మన స్వరాజ్యమందున..!

– భైరోజు రాజశేఖర్
అలంపురం,
జోగుళాంబ గద్వాల జిల్లా – 94417 60015

16. నిలదీత

ఎక్కడరా బీసీ ఎక్కడరా
ఆనవాలెక్కడ బీసీకి రా
దొరల రెడ్ల కాడా ఎంగిలికి ఆశించి
బీసీ కాస్త బానిసగా మారేరా
ఆ బానిస బతుకుల మార్చుకుందామంటే
తీరొక్కదిక్కుకు పోయేనురా
జనసంఖ్య లోన ఎక్కువనే గానీ
జనచైతన్యంలో తక్కువరా
చట్టసభల్లోన చక్రం తిప్పుదామంటే
ఎర వేయు దుడ్లకు సింగెగరేయునురా
వాట్సాప్ లోన మెసేజ్ కే గాని
వాగ్దాటిలోన తక్కువరా
మన హక్కులకోసం పోరాడుదామంటే
లీడర్షిప్పుకై చిచ్చు రేపేనురా
అది లేదు ఇదిలేదని ఆవేదనే గానీ
నిలదీయు దమ్మే తక్కువరా
నిలదీసే మొనగాడు ముందుకవుతానంటే
ఎనకకు గుంజి ఎక్కిరించేనురా

– గుంటి గోపిలత
నాగర్ కర్నూల్ – 8008530209

17. ప్రతిఘటన

ఓ స్వతంత్ర భారతమా !
ఇంకెన్నాళ్ళు ఈ కుతంత్ర
వర్ణపాలనలో కుమ్ములాటలు !
కులవృత్తుల ఫలంపై
కార్పొరేట్ వ్యాపార ప్రేమే కదా
ప్రపంచీకరణ భూతం ముందు
బిసి కులవృత్తుల భవిష్యత్తు
దాసోహమవ్వాల్సిందేనా !
తరాల అంతరంతరాల్లో నిక్షిప్తమైన
మనో సంకల్పం ముందు
సంప్రదాయ కులవృత్తులు పనిముట్లు
ఆధునిక యాంత్రికతలో తెల్లబోవాల్సిందేనా !
వెనకబడిన తరగతుల జీవితాల్లో
మంటపెడుతున్న వర్ణ మార్కెట్‌పై
నీ ప్రతిఘటన స్వరం
తారాస్థాయికి చేరలేదు
నీ స్వేచ్ఛను హరించే
నీ హక్కును కాలరాసే
క్రూరుడిపై తిరుగబడు
సింహంలా గర్జించు శివంగిలా పైనబడు
ప్రగతి కొరకు ప్రయాణించు
నీ శ్వాస నీ ధ్యాస గతితప్పనీయకు
సాధించేవరకు విశ్రమించకు

– తిరుపతి
ఖమ్మం – 8328667821

18. వెనకబాటు

జనగణమన భారత అవనిలో అర్ధగణం బిసి జనం
నేతన్నల నైపుణ్యం కమ్మరన్నల కొలిమిల జోరు
మంగలికత్తుల సత్తువహోరు
పొట్టకూటికై చాకలి చాకిరి మోతల తీరు
కమ్మరన్నల చతురత కంసలన్నల కఠినదీక్ష
వడ్రంగన్నల ఓర్పుతనం వడ్డెరన్నల ఒడిసిన చెమట
రాతిని నాతిగ మలచి, సుందర రూపాలనిచ్చె శిల్పుల చేవ
మత్స్యవేటలో ముదిరాజుల మనోబలం
కమ్మటి కల్లుగీతలో గౌడన్నల గొప్పయుక్తి
కునుకు లేక కూడూ తినక జీవాలే జీవితమంటూ
అలుపు సొలుపు లెరగకుండా కాపుకాసే
గొల్లకురుమల అనునిత్య పయనం
పాలనలో దర్పణం ! సాధనలో దక్షత !
నైతికత, నిబద్ధత, నీతి, నిజాయితి
దశదిశలా ప్రభవించెను బిసి జనుల భవ్యఖ్యాతి
వృత్తిని ఊపిరిగ తలచిన ఓ కులవృత్తులారా !
యాంత్రిక వలయంలో వృత్తులన్ని చిక్కిపోయి
ఉపాధి ఉలికిపడి ఆమడదూరం సాగిపోయే !
గీతచరితను గాంచిన వర్తమాన గమనంలో రేపటి బతుకు శూన్యం !
కులవృత్తులను ఆదరించక, భవిత మీద భరోసా కల్పించక
పూట గడవక, పనిసాగక, పస్తులు ఉపవాసాలే !
జాతిజనుల బతుకుబండి పయనమెటో తెలియని వైనం
సమాజానికి బతికే మార్గం చూపిన బిసిల్లారా
వెనుకబడిన తరగతులవారు కారు మీరు !
కుటిల పాలకుల ఏలుబడిలో వెనుకబడుతున్న తరగతులు మీరు
ఆలోచనల్లా రాటుదేలీ, ఆశయసాధనయే ధ్యేయంగా తలచి
మహనీయుల కలలు సాకారమయ్యే దిశగా
ఏకతాటిపై నిలిచి భారతావనని గెలవాలి !

– భుక్యా బాబునాయక్
సింహపురి – 9989889145

బి సి క వి త

19. దేశభవితకు ఆధారం

ఏమి చెప్పుదు చేతివృత్తుల
చరిత తెలుసుకో భరతవీరా!
దేశభవితము దివ్యమగును
కష్టజీవులు కలిసి ఉంటెనె
జాతి సంపద వృద్ధిచెందును ॥ఏమి॥

భరతమాత శరీరమందు
పల్లె సీమలు జీవనాడులు
అన్నదాతలు శ్రమను చేస్తెనె
పాడిపంటలు పొంగిపొరలును
జగతిలోన భరతభూమియు
అన్నపూర్ణగ వెల్లివిరుయును ॥ఏమి॥

రామరాజ్యమునందు నాడు
బిచ్చమెత్తెడు వారు లేరు
వృత్తులే ఆధారమయ్యేను
బతుకులే బంగారమయ్యేను
గ్రామగ్రామము నందు నేడు
చేతి వృత్తుల చేతెలిరిగే ॥ఏమి॥

కుమ్మరన్నా కుండ చేయదు
కమ్మరన్నా కొలిమి పెట్టడు
చాకలన్నా బట్టలుతకడు
మేతరన్నా బుట్టలల్లడు
ఒకరినొకరున్నాదు కొనరు
ఒక్కటై జీవించ లేరూ ॥ఏమి॥

ఇంటిలోని ఆవుదూడను
కటికెవానికి అమ్మివేసిరి
చేను చెట్టును గిరినపెట్టిన
అప్పుతీరక ఆగమైరి
కదలలేని తల్లిదండ్రిని
కాపు కుక్కగ బతుకు చేసిరి ॥ఏమి॥

పల్లెలన్నియు వట్టిపోయెను
వృత్తులన్నియు మంటకలిసెను
పైసలేమొ ప్రపంచమాయెను
పల్లె సంస్కృతి నడ్డివిరిగెను
పొట్టచేతపట్టుకొని ఘన
పట్టణమ్ముకు జనము పోయెను
॥ఏమి॥

– మారుతి
తెలుగు ఉపన్యాసకులు
జహీరాబాద్ – 9441559184

20. రాజ్యాధికారం!

మనువాద సామాజిక
నిచ్చెనమెట్ల వ్యవస్థ లోపల
నూటికి ఎనభైయైదు శాతాన్ని
కిందికి తోసిందెవ్వరు?
పైన పెత్తనం చేస్తున్న
పదహైదు శాతం మందెవ్వరు?
ఆరువేల నాలుగువందల
కులాలను సృష్టించెదవ్వరు?
ఆస్తికి, విద్యకు, తెలివికి
ఆయుధానికి, ఆత్మగౌరవానికి దూరంచేసిందెవ్వరు?
మనీ, మీడియా, మాఫియాను అడ్డుపెట్టుకుని
అధికారంలో కులుకుతున్నదెవరు?
పరదేశంనుంచి బతకడానికి వచ్చిన
ఆర్యులు వాళ్ళు, మనువాదులు వాళ్ళు
భవిష్యత్తులో సామాజిక పరివర్తన
ఆర్థిక విముక్తి కోసం
బహుజన – సర్వజన రాజ్యాన్ని,
రాజ్యాధికారాన్నిస్థాపించేది
ఈ దేశ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు !

– ఎ.బి.జె.జనసత్యంసాగర్
వనపర్తి – 9154466288

బి సి క వి త

బి
సి
క
వి
త

4

వివిధ రంగాల్లో అత్యున్నతంగా ఎదిగిన మరియు ఆదర్శనీయులైన బి.సి.లు, వారి ప్రత్యేకతలు

1. రైతాంగ విప్లవాగ్ని ఐలమ్మ

పోరాటాల ఖిల్లా
వీరవనితల పుట్టినిల్లు
పోరాటాల పోరుగడ్డ
ఓరుగల్లు ముద్దుబిడ్డ
రాచరిక భూస్వాముల దురాగతాలకు
బలైపోతున్న శ్రామిక జనంకోసం
'కాలం'కడుపుతో ఉండి
వెనుదిరగని పోరు సలపడానికై
వీరవనితను కన్నది ఆమె ఎవరంటే
నీ బాంచన్ నీ కాల్మొక్తా
అన్న బలహీనులచే బందూకులు
చేతబట్టించి గడీలను గడ గడ లాడించిన
ధీర వనిత వీరమాత ఆమె ఎవరంటే
కన్నకొడుకునీ కట్టుకున్నోడినీ
పోరాటంలో పోగొట్టుకున్న
వీరనారి వీరపత్ని అగ్నికణం వలె అనునిత్యం
పోరట నెగళ్లను కాపాడి దొరగాడి పీచమణిచి
ఒడుపుగా పంట చేజిక్కించుకున్న
ధీరోధాత్తురాలు ఆమె ఎవరనుకున్నావో
విస్నూరు దొర గుండాలనెదిరించి
కొంగు నడుముకు చుట్టుకొని
కొడవలి చేతబట్టి శివంగి వలె గర్జించి
రజాకార్ల దురాగతాల నెదిరించి
గుండె ఎదురొడ్డి నిలిచిన తెలంగాణా ముద్దుబిడ్డ
ఆమే మన చాకలి ఐలమ్మ

– వెంకటేశ్వరరావు కె
బొమ్మూరు – 9603629957

బి సి క వి త

2. స్త్రీ హితైషిణి

సమాజం బాగుకోసం
తన జీవితాన్ని అంకితం చేసిన
త్యాగశీలి సావిత్రిబాయి పూలే!
భర్త ఒడిలో అక్షరాలను దిద్దీ
అట్టడుగు వర్గాలకు చదువే
సంపదని భావించి దానిని
పంచడానికి కంకణం కట్టుకున్న కార్యశీలి!
కులమత భేదాలకు అతీతంగా సమాజానికి
తన ప్రేమను పంచీ అక్షరాస్యత ద్వారానే
స్త్రీకి విముక్తి కలుగుతుందని
మహిళాలోకాన్ని మేల్కొలిపిన తొలి గురువు!
సమాజ కట్టుబాట్లను ఎదిరించి
బ్రాహ్మణవాద ఆధిపత్యాలను దిక్కరించిన ధీశాలి!
అంటరాని తనాన్ని వ్యతిరేకిస్తూ
వైధవ్యాన్ని అనుభవించిన ఎంతో మంది మహిళలను
అక్కున చేర్చుకుని అన్నం పెట్టిన అన్నపూర్ణ!
తాను ఎన్నుకున్న మార్గంలో
ఎన్నో అవమానాలను భరించి
బహుజనుల కోసం మొట్టమొదటి సారిగా
పాఠశాలలను ప్రారంభించి సమాజాన్ని చైతన్యం వైపు
అడుగులు వేయించిన గొప్ప సంఘసంస్కర్త
సావిత్రి బాయి పూలే!!

– ఐరేణి కృష్ణవేణి
తెలుగు భాషోపాధ్యాయురాలు
హైదారాబాద్ – 9652407121

బి సి క వి త

3. సబ్బండవర్గాల ఛత్రపతి

పరాయి పాలనయను పడగ నీడన
బహుజనుల గ్రహణమ్ము తొలగించ
పుట్టెను కిలాశపూర్ పిడుగు సర్దారు పాపన్న గౌడు!
కులవృత్తులను వదిలి రాజ్యాధికారమ్ము
మా జన్మ హక్కని కరవాలమును
శత్రువులపై కరుకుగా తిప్పి ధిక్కార స్వరముతో
గర్జించే సింగమై, కౌండిన్యసేన
కీర్తి అజరామరము స్ఫూర్తి !
మొగలాయి మొదలు నిజాము వరకు
పోరు సలిపిన అమర సమర యోధ!
చాకలిసర్వన్న మంగలి మాసన్న
కుమ్మరి గోవిందం జక్కులపెరుమాండ్లు,
దూదేకుల పీర్ మహ్మద్‌లతో
బహుజన సైన్యమును చైతన్య దీప్తితో
ఐక్యమత్యపు పొందిక చేసిన ఆధునిక చాణక్య !
భువనగిరి దుర్గాన్ని బుద్ధితో గెలిచే
ఓరుగల్లు కోటను నేర్పుగా పాలించి
సకల సబ్బండ వర్గాల ఛత్రపతి !
భుజము భుజము కలిపె బహుజన బంధు !
కులమతాల కట్టుబాట్లను కూల్చి
సమసమాజ మేడలు కట్టిన నవసమాజనిర్మాత !
పాపన్న ధైర్యాన్ని పగవాడు మెచ్చుకొనే
దౌర్భాగ్య పాలకులు వీరత్వచరితను విడిచి, మరిచినారు
శౌర్యానికి చిరునామ తెలంగాణ సర్దార్ !
సర్దార్ కావు మా హృదయ దర్బారు మీరు !

– శీలం భద్రయ్య
నల్గొండ – 9885838288

బి
సి
క
వి
త

4. సంఘోద్ధరణ రత్నత్రయం

సంఘ సంస్కర్త
స్త్రీ విద్య ప్రోత్సాహకారి
బడుగుజీవుల పాలిటి దైవ స్వరూపం
కార్మిక కర్షక ఆత్మబంధు
నిరుపేదల జీవితాల్లో చీకట్లు పారద్రోలి వెలుగులు నింపిన
మహాత్మా జ్యోతిబా పూలే!!
బహుజన హితుడు మార్గదర్శకుడు
సకల విజ్ఞాన పారంగతుడు
రాజ్యాంగ నిర్మాణ దక్షుడు
బాబాసాహెబ్ అంబేద్కరుడు!!
కష్టాల కడలిని ఈది చదువు విలువ తెలిసి
శ్రమ సౌందర్యంతో అట్టడుగు స్థాయి నుండి
ఎంతో ఉన్నత శిఖరాలనధిరోహించి
బడుగు బలహీన వర్గాలకు అండగా ఉండి
బీసీల సాధికారతకై అహరహం శ్రమించే
వెనుకబడిన కులాల కమీషన్ అధ్యక్షుడు రచయిత, కథారచయిత
కవి నిగర్వి ఉత్సాహ కవులకు ప్రోత్సాహకారి
అందరి ఆత్మబంధువు బి.ఎస్.రాములు
కులం అడ్డు గోడను త్రోసిరాజని
ఆటుపోట్లను అధిగమించి
కృషి పట్టుదలతో జ్ఞాన సంపద నార్జించి
ముళ్లబాటను పూలబాటగా మార్చుకున్న మహనీయులు
ఆదర్శప్రాయులు.. భరతమాత ముద్దుబిడ్డలు

– డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
హైదారాబాద్ – 9490367383

5. సాహిత్య శంఖా'రామం'

మా రామా!
కరీంనగర్ ఖడ్గమా
జగిత్యాల జ్వాలాజలితమా
సాహితీ రామమా
సామాజిక సేవా నినాదమా
లక్ష్మీనారాయణుల ముంగిటి ముత్యమా
బాధలెన్ని బాల్యంలో కదిలించి వేసినా
గుండె ధైర్య శరాలు సంధించిన సాకేతరామలూ
చందమామ, బాలమిత్రులు నీ రచనా శక్తులుగా
చిన్నారి పొన్నారి చిరుతకూకటి నాడే
'జగిత్యాలకథ'తోనె
తొలి సాహితీ అడుగేసినావు
ప్రజల ఘోష గొంతుకవై ఎలుగెత్తి చాటినావు
పౌరహక్కుల బాటలో అంబేద్కర్
ఆశయాన సాగినావు
'వరవర'హోరవడిలోగద్దర్ గర్జన్య పర్జన్యమైనావు
అలుపెరగని పోరాటం
మార్పుకోసం ఆరాటం
బహుజన, దళిత బాహుబలివై
బహుజన బందూకివైనావు
సాహితీ రచనల రవ్వలరవళి
బహుజన కవితల మువ్వలసరళి
ఐక్యవేదికలతో సమైక్యపరచి
చైతన్య సేవా స్రవంతి వైనావు
స్త్రీవాద కవితల తీర్చదిద్ది సమరశంఖమైనావు

బి సి క వి త

సాహిత్య వ్యాసాల పర్యంకమైనావు
'వేపచెట్టు' కథాసంపుటి
'బ్రతుకుపోరు' నవలతో
గతితార్కిక భావమై బడుగు
ప్రియబంధువైనావు
విప్లవసింధూ, కథాకథన కేంద్ర బిందువై
సాహిత్యపు చుక్కానికి కొత్తచూపు నిచ్చావు
సామాజిక అన్వేషణా నిరంతర
శోధనా రామా!
సమాజ రుగ్మతా రావణునిపై
ధనుష్టంకారమా
అభినవ పాల్కురికి సోమా
మా సాహితీపెన్నిధీ!
దాశరధీ పురస్కార పుష్పమా!
మా బహుజన జావళీ రవళీ
నీ శైలి అనితరం నీ సేవవరం
ఈతరం నిరంతరం సమాంతరం చేయాలని
నీ ఖ్యాతి అఖండితం ప్రచండితం, పండిత ప్రకండితం కావాలి
ఓసాహితీజ్యోతీ మా జాతి ఖ్యాతీ
నీవు నిరంతర సాహితీ సమరుడవు

– కల్వకొలను పద్మకుమారి
నల్లగొండ – 8074011421

6. బహుజన విద్వత్కవి కపిలవాయి

తే.గీ. భవ్య బహుకావ్యకర్తగా భాసురముగ
వెనుకబడిన వర్గాలలో వెనుదిరగక
పండితకవిగా భాసిల్లి ప్రజ్ఞ చూపే!
అంగలేసెను నీకైత లింగమూర్తి!!

తే.గీ. పాఠకులకు నీ సన్నిధి పాఠశాల
పండితులకు నీ పరిచితి ప్రగతిహేల
బడుగు బలహీన వర్గాల గొడుగువీవు!
కావ్య విరచిత దిగ్గజా! కపిలవాయి!!

తే.గీ. పెక్కు కావ్యవిరచితగా పేరుగాంచి
గాన మొనరించి, మంచి వ్యాఖ్యానమిచ్చి
బత్తి రసవాహినుల కేత మెత్తినావు
బహుజన కులదీప! బడుగు భాగ్యరాశి!!
కవికుల నృపాల! రసలోల! కపిలవాయి!!

తే.గీ. పండిత కవులందరిలోన మెండుగాను
అరుదగు కవన మొనరించి, అగ్ర కవిగ
జెప్ప జాలదు నీదు విశేష ప్రతిభ!
భాగ్యమన నీది గాదె! పుంభావ వాణి!!

తే.గీ. కపిలవాయిగా నీ రూపు కవులు కనులు
మూసినను తెరచిన చిత్రముద్ర నిల్చు!
కపిలవాయిగా నీపేరు కవుల నాల్క
రామ తారకమంత్రమై రాణకెక్కు!!

ఉ. ఆ విధమైన ప్రేమ మరియానెన, రా యనురాగ బంధ, మా
భావన, మా శివార్చన ఉపాసన, మా యనురాగచిత్త, మా
పావన మాధురీ మహిత వర్తన, మా కవితా హితైక సం
భావన, మెన్నదేని కనవచ్చెనె నేటి ధరాచరిత్రలో!!

చం. తరగని ధైర్య, మభ్యుదయ ధర్మ పథంబున ప్రీతి, కైత సో
దరులెడ నార్తి, దాన పరతావిధి, శత్రువునైన స్నేహ సం
స్మరణ, సమాదరించు గుణ చారిమ, కూరిమి నించు లింగమూ
ర్తిరొ, శకమంతరించినది కాలమదెంత విచిత్ర శక్తియో?

– తూపురాణి వేంకటకృష్ణమాచార్యులు
తెలుగు ఉపన్యాసకులు
ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు)
గద్వాల, జోగులాంబ గద్వాల జిల్లా
9493755741

5

మహాత్మా జ్యోతిబాఫూలే

బి సి క వి త

1. పూలే ఆలోచనలు వర్ధిల్లాలి!

బి
సి
క
వి
త

అక్షరం
అగ్రహారాలలో బంధీ అయినప్పుడు !
శూద్రవాడల్లో అక్షరమై పూసిన పువ్వు పూలే !!

అక్షరం
అగ్రవర్ణాలకే ఆస్తి అయినప్పుడు !
సమాజపరంచేసిన విద్యా ఉద్యమ
పితామహుడు పూలే !!

వితంతు వివాహాల
నిషేధ ఛాందసాలను !
ఏడడుగులు నడిపించిన శూద్ర పూజారి పూలే !!

ఉయ్యాల పసిపాపకు
పసుపుతాడే తాడై ఊగినప్పుడు !
బాల్య వివాహ దురాచార ఊపిరితీసిన
ఉరితాడు పూలే !!

అంటరానితనం
వెలివేతల కారు చీకటిపై పోరాడిన !
నూటొక్క పొద్దుల చైతన్య పూలే !!

అపౌరుషేయాల ఆజ్ఞలను
రచ్చకట్ట చెట్టుకు కసిదీర కట్టేసిన !
అనంతకోటి ప్రశ్నల రూపం పూలే !!

పూలే ఆలోచనలు వర్ధిల్లాలి !!!

– పెబ్బేటి మల్లికార్జున్
కల్వకోల్ – 9491881916

2. దిక్సూచి

అతడు అణగారిన వర్గాల ఆశాజ్యోతి
సమసమాజాన్ని కాంక్షించిన సంఘసంస్కర్త
వర్ణ వర్గ వ్యవస్థ నిర్మూలనకు
నడుంకట్టిన ఉద్యమనేత
నూతన సమాజానికి అడుగులు వేసిన
సాంస్కృతిక విప్లవకారుడు
తరతరాలుగా పట్టిపీడిస్తున్న కులవ్యవస్థకు
ఎదురుగు తిరిగిన సామాజికవేత్త
మూఢనమ్మకాల నిర్మూలనకు
పాదులువేసిన ఉద్యమ దీప్తి
అగ్రవర్ణాల ఆధిపత్యంపై
జూటం విదిల్చిన బిసి సింహం
అవిద్యే అజ్ఞానానికి కారణమని
విద్యాలయాన్ని నెలకొల్పిన
భారత ప్రథమ ఉపాధ్యాయుడు
సమాజానికి స్త్రీ విద్య అవసరమని
తొలి బాలికల పాఠశాలలను
స్థాపించిన స్త్రీ పక్షపాతి
నిమ్నజాతుల చదువుకోసం
తొలిసారిగ రాత్రిబడులను ఏర్పాటుచేసిన
శ్రామిక పక్షపాతి
వితంతు వివాహాలను జరిపించిన
అసలైన సంఘసంస్కర్త

బి సి క వి త

బి సి క వి త

సత్యశోధక సమాజాన్ని స్థాపించి
మూఢాచారాలకు కళ్ళెం వేసిన
ఆధునిక భారత నిర్మాత
దీనబంధు పత్రికను నెలకొల్పి
సామాజిక సమస్యలను పరిష్కరించిన చైతన్యమూర్తి
బిసి ఉద్యమ పితామహుడిగా
మహాత్మ బిరుదును పొందిన పూజ్యనీయుడు
బహుజనుల విముక్తి కోసం
అవిశ్రాంతంగా పోరాటం
చేసిన ఆదర్శనీయుడు
జ్యోతిరావుఫూలే
బిసిల ఆశాకిరణం
బడుగు బలహీనవర్గాల ఆభరణం.

– డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్
9032844017

3. సంస్కర్త

ఈ జగాన మేటి సంఘసంస్కర్తలలో
ఒకడన్నా మహాత్మా జ్యోతిరావు పూలే
లోకాన పూజలందుకుంటున్న మహనీయులలో
ఇతడేనన్న ముందు వరసలోనున్న సామాజిక తత్వవేత్త
మనమున్న ప్రగతిశీలదేశ నిర్మాణ సారథులలో
ముందున్న నవయుగ వైతాళికుడు
వితంతు పునర్వివాహ యోచనుడు
దేశపురోగాభివృద్ధి జరిపించాలనే బాధ్యత
పౌరుడైన దేశప్రజలందరిదనే కర్తవ్యాన్ని తెలిపాడు
పురుషుడన్న వాడి ఆధిపత్యమున్న చోట
ఎక్కడైనా అబలను సబలని నిరూపించాడు
అందున ధర్మముందని స్త్రీకి విద్య నేర్పని చోట
ధర్మమేనన్న నీతితో స్త్రీకి విద్య చెప్పించాడు
అర్థాంగన్న పదాన్ని గ్రంథానికే పరిమితం చేస్తే
నేనున్నానని తన భార్యను ఉపాధ్యాయినిని చేసాడు
వెనకున్న జాతి వాడు పూలే అనుకున్న
వారన్నా ముక్కున వేలేసుకున్నారన్న
క్రిందున్న వెనకబడిన బడుగుజాతి కాదు
ముందున్న సంస్కరణలనెరిగిన జాతన్నాడు
తగిన ప్రాచుర్యాన్నివ్వని నేటి సమాజాన
మనమన్న పూలే మార్గదర్శకుడని చాటుదాం!

– దీపక్ న్యాతి
నంది అవార్డు గ్రహీత
స్టేజి, టివి, సినీ రచయిత, దర్శకుడు
హైదరాబాదు – 9849488837

బి సి క వి త

4. భాగ్యవిధాత

ఆ.వె. వెనుకబడిన కులము వేల్పుగా నిలబడి
జాతి సేవ జేసె ప్రీతిమెరయ
జ్యోతి వలెను వెలిగె జ్యోతిరావ్ పూలె తా
దీన జనులపాళి దివిటిసుమ్ము

ఆ.వె. బడుగు జీవతతికి భాగ్యవిధాతయై
ముందు జూపు జూపి ముదమునింపె
శూద్ర జాతిజనులు భద్రమ్ము గానున్న
హద్దులేనిప్రగతి యవని నిల్పు

ఆ.వె. హితము గూర్చుచుండు సతియు చదివెనేని
సమ సమాజ మొదవు చదవు వలన
బాగు పడుదురంచు భార్యను చదివించి
నట్టి వారు ఘనము నరుదు నాడు

ఆ.వె. పాఠశాల లపుడు బాలికల కొరకు
పెట్టినాడు పూలెదిట్టయౌచు
భార్య చదువు జెప్ప బాగుగా నడిపిరి
అతని యడుగు జాడ హాయినింపు

ఆ.వె. కులము పేర నున్న కుత్సితములు బాప
ముందు నిలచె పూలె వందితునిగ
సంస్కరించి నాడు సంఘ విశ్వాసముల్
కీర్తి గాంచి నట్టి మూర్తి యతడు

ఆ.వె. రాత్రి బడిని పెట్టి రంజిల్లు నట్లుగా
చదువు చెప్పబూనె చక్కగాను
శూద్రులంత జేరి శ్రద్ధగా చదువగా
మురియు చుండె పూలె మునివిధాన

– బాలురు ఎల్లారెడ్డి
కళ్యాణి, మండలం: ఎల్లారెడ్డి ,
జిల్లా: కామారెడ్డి – 9491534075

5. జ్యోతిబాపూలె

జాతి వస్త్రముతికె సద్భావ సబ్బుతో
మైలతొలగిపోగ మనసులందు
స్వచ్ఛమైనవిద్య సంస్కారవంతుడై
నేర్చి నాడు తాను నేర్పుమీర

సంఘవక్రగతులు సక్రమ రీతిగా
నడవ నడుముగట్టి నడిపినాడు
దుష్టసంప్రదాయ దుర్నీతి కంపును
శుభ్రపరిచి మతులు శుద్ధిచేసె

వేరుపురుగుబోలు వేళ్ళనుచీల్చెటి
వెర్రితనముజూచి వేదనొంది
రోగమెరిగితాను బాగుచేయగసాగె
కార్యరంగమందు కదిలిముందు

కడిగివేసినాడు కర్తవ్య దీక్షతో
సంఘకల్మషాలు సంస్కరించి
సత్యసంస్కృతీయ జాతీయజీవన
సౌరభాలు విరిసి సౌఖ్యమలర

ఆకుల మల్లికార్జున్
షాద్ నగర్
7207256204

బి
సి
క
వి
త

6. మహాత్మ !

మహారాష్ట్రలోని సతారా జిల్లా
వ్యవసాయ కూలీ గోవిందరావు
పుణ్యాల భాగ్యమై జన్మించినావు
కూలి బతుకుల్లో ముసిరిన చీకట్ల
వెతలను బాపి జ్యోతి వైనావయ్యా
బడుగు వర్గాల ఆత్మ బంధువై
మహాత్మా అని పిలువబడినావయ్యా
కులవివక్ష నీవు అంతమొందించ
దీనులకు దీనబంధువైనావయ్యా
చైతన్య దీప్తిని బలహీనవర్గాల
నరనరాన నింపి ప్రాణమైనావయ్యా
సతీమణి సావిత్రిబాపూలేతో కూడి
స్త్రీ విద్య కై నీవు శ్రీకారమైనావయ్యా
అమానుష సూత్రాల అంతునే చూసి
వితంతు వివాహ తంతువైనావయ్యా
వర్ణవ్యవస్థ పట్ల వ్యతిరేకత పెంచి
సహపంక్తి భోజనం తాంబూలమైనావయ్యా
మద్యపానంపైన కొరడాను ఝుళిపించి
బాధితులకు నీవె వేల్పువైనావయ్యా
రాత్రిబడి పెట్టించి బతుకులను దిద్ది
జ్ఞాననిధి నిచ్చె అక్షరమ్మైనావయ్యా
గులాంగిరి సేద్యగాని చర్మకోలల రాసి
గులాములందుకొని మహాత్ముడి వైనావయ్యా

– రావుల కిరణ్మయి
హన్మకొండ, వరంగల్ అర్బన్ జిల్లా
9705166957

7. నిజమైన మహాత్ముడు

మా జ్యోతిరావుపూలే బహుజన జ్యోతి నీవైతివి
అభాగ్యులకు, అనాధలకు వెలుగునిచ్చే వేగుచుక్కవైతివి
అణగారిన బిడ్డలకు ఆత్మబంధువు నీవైతివి
సామాజిక ఉద్యమ పోరును సాగించినావు
చదువు సారంలోనే జీవిత గమనం ఉందని
బడుగు బలహీనుల బతుకు బాగు చేయాలని
శ్రమజీవుల గుర్తించి చీకట్లో చదువులు అందించి
అణచబడ్డ బతుకులకు అక్షర ఆయుధాన్నిచ్చిన ఆదర్శమూర్తివి
సమాజాభివృద్ధికి కంకణ బద్ధుడవై నిలిచినావు
కుల వివక్ష నెదిరించి, స్త్రీ విద్యను అందించి
జనంలో చైతన్యం నింపినావు
కబంధహస్తాల నుండి కర్షకుల రక్షించ విజ్ఞాన జ్యోతివి నీవైనావు
సత్యశోధక సమాజ స్థాపనతో సమాజాన్ని మేల్కొలిపినావు
బహుజనులే ఈ దేశ మూలవాసులంటూ బహు చక్కగా చెప్పినావు
ప్రగతిశీల సమాజం నిర్మాణముకై పోరాటాలు ఎన్నో చేసినావు
నిజమైన మహాత్మా నీకు నీరాజనాలు
అందుకో మా వందనాలు.. అందుకోవయ్యా !
మరువలేము మహాత్మా ! నీ సేవలు మరువలేము !
నిత్యము నీకై వందనాలు చెల్లిస్తూ
బహుజన రాజ్యంకై పొరదుతాం...!

– దుప్పటి మొగిలి
ఉపాధ్యాయులు
భూపాలపల్లి – 8466827118

బి
సి
క
వి
త

8. సామాజిక తత్త్వవేత్త

కం. చదువే పరమార్థంబ ని
చదువే మూలంబ నియని ,సావిత్రికి తా
చదువును బోధించినిలిచి
చదువుల విలువను సతతము చక్కగ దెల్పెన్

కం. బ డుగుల యభ్యున్నతికై
వడిగా సేవలు సలిపెను వసుధాస్థలిపై
నడయాడిన స్థితప్రజ్ఞుడు
బ డులను స్థాపించితాను వరమైనిలిచెన్

కం. వ్రాసె "గులాంగిరి" పొత్తము
భాసుర మొప్పంగజ్యోతి బాపూలే, తా
చేసెను పలువిధా సేవలు
వాసిగ "చరితార్థినొందె" వైభవమొప్పన్

కం. మహనీయుడు బాపూలే
మహనీయుడు నిత్యస్ఫూర్తి మనభాగ్యంబే
మహనీయుడు నాదార్శము
మహనీయుడు భరతమాత మణిరత్నంబే

కం. కులపరమైన వివక్షను
నిలలో జూపింపతగదు , నెప్పుడుననియెన్
విలువలు కోల్పోవద్దని
సులువుగ హితబోధా జేసె సూరి మహాత్మా!!!

కం. హక్కులకై పోరాడియు
మిక్కిలి యాంక్షల గురైన మేధావిగ తా
చక్కని ప్రణాళికలతో
యిక్కట్లను బాపివేసె నీసంఘములో

"పద్యప్రవీణ" కట్టరంజిత్ కుమార్
తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ మరియు
పి.జి.(స్వయంప్రతిపత్తి)కళాశాల, సిద్ధిపేట - 9703239944

9. బడుగుల బంధువు

బడుగుల బతుకుల వెన్నెలవు పూలే బాపు!
అట్టడుగు జాతుల పెన్నిధి నీవు!!
అంటరాని తనం మంట గలవాలని !
ముందుకు కదిలినావు!!
అసమానతలు రూపు మాయలని!
సమానత్వానికై కదిలితివి!!
బడుగు జాతుల బంధువు నీవు!
అణగారిన బతుకుల అండవు!!
అంటరానితనం రూపు మాసేది!
చదువుతోనే సాధ్యామంటివి!!
శూద్రుల వాడల్లో నువ్వు సాగితివి!
బడులను పెట్టి విద్య నేర్పితివి!!
బాల్య వివాహాలు వలదు అన్నావు !
వితంతువులకు పెళ్లిళ్లు జరిపించినావు!!
గులాంగిరి వలదు అంటివి!
అభిమానంతో బతకమంటివి!!
అణిచివేతను ప్రశ్నించినావు!
అసమానతలను ఎదిరించినావు!!
చైతన్య దీప్తి వందనం!
జ్ఞాన దాత అభివందనం!!

– గంగుల రాజేందర్ యాదవ్
కవి, గాయకుడు, రచయిత
గ్రా: పాలెం, మం: మోర్తాడ్,
జి: నిజామాబాద్ – 8179869972

బి సి క వి త

10. ధరిత్రి బిడ్డ

జ్యోతిరావు పూలే
మా జ్ఞానజ్యోతివి నీవేలే !
చక్కని చదువులు బోధించావు
జీవితాల్లో వెలుగులు నింపావు
నీ ధ్యాస ఒక్కటే, నీ శ్వాస ఒక్కటే
చదువు చదువు చదువు !
తక్కువ జాతోళ్ళకు నీవు
తళుకులీను వజ్రం
సాధికారతకు నీవు
చక్కని ఉదాహరణ
అభివృద్ధికి నీవు మార్గ నిర్దేశం
అక్షర జ్ఞానం దిద్దినావు
అభివృద్ధిని చేకూర్చి నావు
చదువుకుంటే బ్రతుకు
లేకుంటే జీవితం చితుకు
జీవితాన్ని దిద్దు, భవిష్యత్తు ముద్దు
సాహసోపేత నిర్ణయం
సావిత్రమ్మ మొదటి టీచర్
సందిగ్ధ పడలేదు చదువు రాకున్న
స్త్రీ జాతికి గర్వకారణంగా
మలిచావు మంచిగ ఆమెను
ధన్యజీవులు మీరు, ధరిత్రి బిడ్డలు మీరు !!

– తాండ్ర చిరంజీవి
తెలుగు ఉపాధ్యాయులు
వరంగల్ అర్బన్ – 9959180762

11. ఆదర్శవ్యక్తి

మహనీయుల మానవహక్కుల రచనలకు ఆకర్షితుడై
సమాజ అభివృద్ధికి పాటుపడిన కర్తవ్యజ్యోతి
బడుగు బలహీన వర్గాల సాధికారతకు
చైతన్య స్ఫూర్తిని నింపిన అరుణ జ్యోతి
సమాజంలోని మూఢనమ్మకాలను పారదోలి
నవభారత నిర్మాణానికి రచనలు చేసిన అక్షరజ్యోతి
మహిళ అభ్యున్నతికి పాటుపడుతూ
స్త్రీ విద్యను ప్రోత్సహించిన చైతన్యజ్యోతి
సతీ సహగమనాన్ని రూపుమాపి
వితంతు వివాహాల ప్రోత్సహించిన ఆదర్శజ్యోతి
మతోన్మాద శక్తుల ఆటకట్టించి
అసమానతలపై ఎదురు నిలిచిన విప్లవజ్యోతి
పక్షులకు జంతువులకు లేని కుల మత భేదాలు
మనుషులకెందుకని నినదించిన లౌకికజ్యోతి
సంఘసంస్కర్తగా మానవతావాదిగా
ఆదర్శవ్యక్తిగా సజీవంగా నిలచిన ఉద్యమజ్యోతి

– జక్కు కృష్ణమూర్తి
తెలుగు భాషోపాధ్యాయులు
ప్రభుత్వ ఉన్నత పాఠశాల
హుజూరాబాద్,కరీంనగర్.
9912328949

12. జ్యోతిరావు పూలే మొగ్గలు

బహుజనుల కోసం పోరాడుతూనే
భాషాభివృద్ధికి నిరంతరం తోడ్పడినాడు
విద్యను పంచిన విద్యాజ్యోతి పూలే

స్త్రీల చదువుకోసం ఆరాటపడుతూనే
భార్యలో సగమై సంఘసేవచేసినాడు
జ్యోతిరావుపూలే సత్యశోధక నిర్మాత

బడుగుజీవుల జీవితాలను చక్కదిద్దుతూనే
భావిభారత నిర్మాతలను చేయాలని తలచినాడు
జ్యోతిరావుపూలే చైతన్యపరిచిన విప్లవజ్యోతి

పెత్తందారుల ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూనే
కులవివక్షతపై నిత్యం పోరాటం జరిపాడు
సంఘసంస్కరణ కోసం తపించిన పూలే

అందరి మనసులలో అమరుడై నిలుస్తూనే
అబలల జీవితాలను సబలలుగా తీర్చిదిద్దాడు
అన్యాయాన్ని ప్రశ్నించిన అమరజ్యోతి పూలే

- రవికిరణం-సత్యనీలిమ
ఉపాధ్యాయురాలు
వనపర్తి - 9502156813

13. జ్యోతీరావు ఫూలే

(మణిపూసలు)

మహారాష్ట్ర ప్రాంతమందు
సతారా జిల్లా యందు
సంస్కర్తగా జన్మించెను
గోవిందుని ఇంటియందు

జ్యోతీరావ్ గొప్ప ఘనుడు
సామాజిక దార్శనికుడు
కులవ్యవస్థ నెదిరించిన
నవయుగ వైతాళికుండు

దళితులకు దీనబంధు
కార్మికుల కాత్మబంధు
పనిగంటలు తగ్గించగ
పోరాడె సంఘమందు

సభలను ఏర్పరచెను
విద్యా విలువ తెలిపెను
ఆదర్శము కావాలని
భార్యను చదివించెను

భర్తకు తను తోడయ్యెను
బ్రాహ్మణులను ఎదిరించెను
బాలికలకు చదువు చెప్పి
తొలి పంతులమ్మ అయ్యెను

కర్షకులకు బాంధవుడు
ఆధునిక యుగపురుషుడు
స్వయం కృషితో నెదిగి
మహాత్ముడై నిలిచాడు.

– గాండ్ల వీరమణి
షాద్‌నగర్, రంగారెడ్డి(జిల్లా) – 9912540101

14. బడుగుల బలం

సీ॥ ఆడపిల్ల చదువు లందాలు విరజిమ్మ
ఇంటికే వెలుగంటు నెదను నాటి
దళితులన్ దరిజేర్చి ధైర్యంబు నింపియు
విద్యయొక్క విలువ విశదపరచి
పాఠశాలల బెట్టి పాఠంబులను జెప్పె
చదువుల సారంబు సాంతమొప్ప
కలిసి నడవలేని గడుసుబుద్ధులజేరి
యాలోచనల బాపి యహము దునిమె

ఆ.వె॥ కులము కన్న గుణము గొప్పదనుచు చాటి
మానవత్వ గరిమ మహిని నిలిపి
బడుగు జీవులకును బలము తానైయుండి
భవితయందు నాశ పాదు గొలిపె.

ఆ.వె॥ అంటరానివారి హక్కులన్ గాపాడ
పోరు సలిపె నాడు పూలె ఘనుడు
అగ్రవర్ణపౌర యాగడంబుల నుండి
శూద్రజాతి బ్రోచె శూరవరుడు.

ఆ.వె॥ వెనుకబడినవారి వెలుగురేకై నిల్చి
ప్రగతిబాట కొరకు పరితపించె
పాలుపంచుకొనెను ప్రజల కష్టములందు
సంఘసేవ జేసె సౌమ్యమూర్తి.

– నాయని రాములు
సోమేశ్వర్, కామారెడ్డి జిల్లా – 9989390434

15. యుగపురుషుడు

దురాచారాలతో కునారిల్లే
సమాజానికి చికిత్సకై
ఉదయించిన చైతన్య దీపిక అతడు!!
నిరక్షరాస్యతలో కొట్టుమిట్టాడే
బలహీనులకు అక్షర జ్ఞానమందించిన
విజ్ఞాన పిపాసి అతడు!!
మూఢాచారాలు రూపుమాపేందుకు
కృషి చేసిన కంకణబద్ధుడు
బహుజన బాంధవుడు
మహాత్మగా విలసిల్లిన బడుగుల ఆశాదీపం అతడు!!
రైతుల పాలిటి దీనబంధు
కార్మికుల పాలిటి ఆత్మబంధువు
కులవ్యవస్థను కూకటి వేళ్ళతో పెకలించేయాలని
నినదించిన నవయుగ వైతాళికుడు!!
సమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా
దారులు వేసిన తొలి సామాజిక ఉద్యమకారుడు
భారత ప్రథమ సామాజిక తత్వవేత్త అతడు!!
సంఘ సంస్కరణే ధ్యేయంగా
స్త్రీ విద్యే లక్ష్యంగా అహరహరం శ్రమించిన
నిమ్న వర్గాల వెలుగు దివ్వె అతడు!!
అణగారిన వర్గాల హక్కులకై పోరాడి వారి
సాధికారతకు కృషి చేసిన మహోన్నతుడు
అతడే .. బహుజనుల గుండెల్లో గూడు కట్టుకున్న
ఆధునిక సంఘసంస్కర్త యుగపురుషుడు
మహాత్మా జ్యోతిరావు పూలే!!

– పరిమి వెంకట సత్యమూర్తి
హైదారాబాద్ – 9440720324

బి
సి
క
వి
త

16. అక్షరమాల

బడుగు బలహీనుల బాటసారి పూలే
అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి పూలే
నవభారత నిర్మాత పూలే
కుల, వర్గ, వర్ణాల నిర్మూలన విప్లవనేత పూలే
అంబేద్కర్ రెండవ గురువు పూలే
మూఢనమ్మకాలను పారద్రోలిన ఉద్యమకారుడు పూలే
వేద పురాణాలకు కొత్తభాష్యం చెప్పిన సామాజికవేత్త పూలే
కర్మసిద్ధాంతాన్ని నమ్మని నేత పూలే
శూద్రులను, అతిశూద్రులను తట్టిలేపిన సంఘసంస్కర్త పూలే
ఆదర్శ వివాహాలను ఆజ్యం పోసింది పూలే
బ్రాహ్మణమహిళల కష్టాల కోసం
పోరాటంచేసిన దార్శనికుడు పూలే
బ్రాహ్మణిజ వ్యతిరేకి పూలే
ఉవిదలకు ఊతమిచ్చి పూలే
నిరంతర విద్య నేర్పిన తొలిగురువు పూలే
దీనంగా ఉన్న దీనులకు 'దీనబంధు'
వారపత్రిక నందించినది పూలే
'మహాత్మ' బిరుదు పొంది
మనిషిని మహోన్నతుడిగా
తీర్చిదిద్దేది విద్య ఒక్కటే అన్నది జ్యోతిబాపూలే.

– దశరథం
9030860356

17. నిస్వార్థజీవి

సామాన్యమానవుని గురించి
సాంఘిక వ్యవస్థల మార్పు గురించి
సగటు మనిషి జీవితం మెరుగు గురించి
కుల నిర్మూలన గురించి
సమాన హక్కులు సత్ప్రవర్తన గురించి
ఉపన్యాసాలు ఇస్తూ పోరాడిన
భారతదేశ సామాజిక సంస్కర్తలలో
జ్యోతిరావ్ పూలెదే అగ్రస్థానం
పితృస్వామ్య ధోరణులలో అణచివేతకు గురి అవుతున్న
స్త్రీల పరిస్థితికి జాలిపడి కొన్ని వర్గాలు మాత్రమే
భోగభాగ్యలతో తులతూగడం
ప్రగతి లక్షణం కాదని ఎలుగేత్తి చాటి
ఉన్నత వర్గాలకే పరిమితమైన విద్యను
అట్టడుగు వర్గాలకు చేర్చాలని
తనపోరాటాన్ని అమలు పరచిన సాహసోపేతి
ఈయన సతీమని భర్త ఆదర్శాలను
అర్థం చేసుకొని నిమ్న జాతి బాలికల
పాఠశాలలో పాఠాలు చెప్పిన ధైర్యశాలి
పని కర్తవ్యపాలన ఆయన నరనరాన జీర్ణించుకున్న గొప్ప వ్యక్తి
దళితవర్గాలను జాగృతం చేసి క్రియాశీలి
భారతీయులంతా ఒక్కటే అనే భావనకు ఆద్యుడు
ఒంటరిగా నీతిగా నిజాయితీగా పోరాడిన యోధుడు
భారతీయులు మొట్ట మొదటిసారిగా
మహాత్మా అని బిరుదునిచ్చి సత్కరించింది
సత్యమేవజయతే అన్నది జ్యోతిరావు పూలే విశ్వాసం

– పోతన జ్యోతి
9603114896

తెలుగు భాషా
చైతన్య సమితి
నిర్వహించిన
వివిధ
కార్యక్రమాల
దృశ్యమాలిక












కళా లలిత కళావేదిక








తెలుగు భాషా చైతన్య సమితి

ప్రచురణలు

ప్రచురణ సంఖ్య	పుస్తకం పేరు	ప్రచురణ
1	యుగాది కవిత (శ్రీ విళంబి కవితా సంకలనం)	మే, 2018
2.	సాహిత్యంలో సహస్రబాహుడు (ద్వానా శాస్త్రి సాహిత్య జీవిత పరిచయం) – డాక్టర్ వి.జయప్రకాష్	మే, 2018
3.	భాస్కరోదయం (కవితాసంపుటి) – డాక్టర్ ఎస్ విజయభాస్కర్	జూన్, 2018
4.	కవితార్చన (ద్వానా సప్తతిపూర్తి కవితా సంకలనం)	జూన్, 2018
5.	యాదాద్రి వైభవం (యాదాద్రి కవితా సంకలనం)	సెప్టెంబర్, 2018
6.	తెలుగు పలుకుల కొలువరి మారేపల్లి రామచంద్రశాస్త్రి (కవిగారు) – డాక్టర్ ద్వానా శాస్త్రి	డిసెంబర్, 2018
7.	శ్రీ వేంకటేశ్వర వైభవం (111 కవితల సంకలనం)	మే, 2019
8.	శ్రీశ్రీశ్రీ సిద్ధప్ప వరకవి స్మారక కవితా సంకలనం	జూన్, 2019
9.	బి.సి. కవితా సంకలనం	డిసెంబర్, 2019





ఎన్. ఉమేశ్‌కుమార్ యాదవ్

తెలంగాణరాష్ట్ర మంత్రులకు, ఎంపీలకు
ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు,
ప్రజా ప్రతినిధులకు శ్రేయోభిలాషులకు,
బంధుమిత్రులకు ఉపాధ్యాయ మిత్రులకు, విద్యార్థిని విద్యార్థులకు



బతుకమ్మ దసరా, దీపావళి శుభాకాంక్షలు

'శ్రమ నీ ఆయుధమైతే విజయం నీ బానిస అవుతుంది'

'విద్య మన హక్కు- అందరు చదవాలి, అందరూ ఎదగాలి, 'పచ్చని చెట్లు
- ప్రగతికి మెట్లు' 'చెట్లను పెంచుదాం - అకుపచ్చ తెలంగాణచేద్దాము',
'స్వచ్ఛ భారత్- హరిత తెలంగాణకు పాటు పడుదాము'
దత్తత తీసుకున్న పాఠశాలలు: తాత - నానమ్మ గార్లు
శ్రీమతి నక్క భాగమ్మ యాదవ్ - శ్రీ నక్క బాలమ్మ యాదవ్,
శ్రీ నక్క వెంకట్‌స్వామి యాదవ్
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాహెబ్‌నగర్, హయత్‌నగర్ మండలం,
రంగారెడ్డి జిల్లా, తెలంగాణ, ఇండియా.

నక్క శ్రీనివాస్ యాదవ్
ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు

అమ్మ - నాన్నగార్లు
శ్రీమతి నక్క వెంకటమ్మ యాదవ్ - శ్రీ నక్క యాదగిరి స్వామి యాదవ్
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనుమగల్ హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ, ఇండియా

ప్రియమైన ప్రజానికమా తల్లిదండ్రుల, తాత- నానమ్మ తాత - అమ్మమ్మ గార్లు గౌరవ ప్రతినిధులు విద్యార్థినీ, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిద్దాం, ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకుందాం!

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగంపై ఎంతో ధనం ఖర్చు చేయుచున్నది. కాని మనం సరిగా ఉపయోగించుకోవడం లేదు. ఈ కింది సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలలో లభిస్తున్నాయి.

1. ఉచిత విద్య, 2. యూనిఫామ్స్, 3. పాఠ్యపుస్తకాల పంపిణీ, 4. అందుబాటులో ప్రభుత్వ పాఠశాలలు 5. ఉచిత కంప్యూటర్ విద్య, 6. డిజిటల్ ప్రొజెక్టర్‌తో క్లాస్‌రూమ్ & సైన్స్ ల్యాబ్, 7.సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, 8. విశాలమైన తరగతి గదులు- ఆటస్థలము, 9. కోకరిక్యులర్ అంశాలకు ఇతన అవసరాలకు మరియు పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర మరియు జాతీయస్థాయి క్రీడోత్సవాలకు శిక్షణమొదలగునవి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నారు.

మొట్టమొదటి ప్రభుత్వ పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్‌ను ఏర్పాటు చేసిన రూపశిల్పి దాత....

ఇట్లు:

అమ్మ - నాన్న: శ్రీమతి నక్క వెంకమ్మయాదవ్ - నక్క యాదగిరి స్వామి యాదవ్
ఎడ్యుకేషన్ & స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు - శ్రీ నక్క శ్రీనివాసయాదవ్
విద్యార్థి శ్రేయోభిలాషి, విద్యాభిమాని, ఉద్యోగ, ఉపాధ్యాయ బంధువు నక్క యాదగిరి స్వామి యాదవ నిలయము
ద్వారకమాయి నగర్ కాలనీ, ఆటోనగర్, బాగ్ హయత్‌నగర్, వనస్థలిపురం, రంగారెడ్డి జిల్లా తెలంగాణ, ఇండియా

నేను ఆ దేవదేవ కృపవల్ల ఇతరులకు సేవ చేసే భాగ్యం కల్పించినందుకు సర్వద కృతజ్ఞతుని

'సర్వేజనా సుఖినోభవంతు - సమస్త సన్మంగళాని భవంతు'